కావలెను
విశాఖ సమాచారమ్
తెలుగు దినపత్రిక
కార్యాలయం నందు పని చేయుటకు
డిటిపి ఆపరేటర్ కావలెను.
సెల్: 9393949345

VISAKHA SAMACHARAM TELUGU DAILY: VISAKHAPATNAM
Postal License No. VSP / 96/ 2021 - 23
visit: www.visakhasamacharam.com

# విశాఖ సమాచారమ్

Sugar Free
Fitearly
రెండుపూటలా సేవించండి.
శక్తివంతంగా జీవించండి.
వివరములకు
8247526179
డీలర్లు కావలెను.

RNI No.52722/90 సంపుటి : 34 సంచిక : 64 విశాఖపట్నం, 14 డిశంబరు 2023 గురువారం E-mail : vspnews@gmail.com, పేజీలు : 8 వెల : రూ.2.00

## పక్కా ప్లాన్‌తోనే పార్లమెంట్‌లో కలర్‌స్మోక్ దాడి

### ఆ నలుగురు ఎవరు..?



రెండు సంఘటనలు, నలుగురు వ్యక్తులు, పార్లమెంట్‌పై దాడి జరిగి 22 సంవత్సరాలు అయిన వేళ, సరిగ్గా అదే రోజున లోక్‌సభలో మరోసారి భద్రతా వైఫల్యం చోటుచేసుకుంది. లోక్‌సభ జీరో అవర్ ముగింపు సమయంలో ఇద్దరు యువకులు సభలో కలకలం సృష్టించారు. సభ వెలుపల మరో ఇద్దరు హడావుడి చేశారు. మధ్యాహ్నం ఒంటి గంట ఒక నిమిషం సమయంలో లోక్ సభలో చివరి వరుసలో కూర్చున్న బెంగాల్ బీజేపీ ఎంపీ ఖగేన్ ముర్ము తన నియోజకవర్గంలో ఎయిర్‌పోర్టు ఏర్పాటు చేయాలని కోరుతున్న సమయంలో హఠాత్తుగా ఏదో కింద పడ్డ శబ్దం వినిపించింది. ఏంటా అని సభ్యులు చూస్తున్న సమయంలోనే ఒక యువకుడు ఎంపీలు కూర్చునే టేబుల్స్‌పై నుంచి దూకుతూ స్పీకర్ స్థానం వైపు వేగంగా పరిగెత్తడం మొదలు పెట్టాడు. ఆ కలకలం గమనించి సభాపతి స్థానంలో ఉన్న ప్యానెల్ స్పీకర్ రాజేంద్ర అగర్వాల్ సభను వాయిదా వేశారు.

టేబుల్స్ పై నుంచి (మిగతా 2లో)

## శబరిమలలో భక్తుల రద్దీ



శబరిమలలో భక్తులు పోటెత్తుతున్నారు. దర్శనానికి 20 గంటలకు పైగా సమయం పడుతోంది. అయిదు రోజులుగా భక్తుల రద్దీ భారీగా పెరిగింది. రద్దీని అంచనా వేయడంలో, ఏర్పాట్ల విషయం లోనూ తప్పుగా అంచనా వేసి నిర్వహించడంపై ప్రతిపక్షాలు కేరళ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తంచేస్తు న్నాయి. తాజాగా తిరువనంతపురంలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఈ సమయం లోనే దేవస్థానంతో సంప్రదింపులు చేసిన ప్రభుత్వం కీలక నిర్ణయం ప్రకటించింది.

శబరిమలలో సరైన సౌకర్యాలు కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం అయిందని ఆరోపిస్తూ బీజేపీ ఆందోళనకు దిగింది. రోజుకు శబరిమలకు లక్ష మంది భక్తులు చేరుకుంటుండటం. సరైన సౌకర్యాలు కల్పించడం లేదని బీజేపీ ఆరోపిస్తోంది. కొన్ని కిలోమీటర్ల దూరం లో వాహనాలు నిలిచిపోయాయి. బీజేపీ శ్రేణులపై వాటర్ క్యానన్లతో అడ్డుకుంటున్నారు. స్వామి వారి దర్శనం కోసం వచ్చిన కొందరు భక్తులు అయ్యప్పను

(మిగతా 2లో)

## ఏపీ ప్రభుత్వం క్లియరెన్స్ సేల్ మొదలుపెట్టింది: నాదెండ్ల మనోహర్



మంగళగిరి: గత మంత్రివర్గ సమావేశంలో అనేక కంపెనీలకు విచిత్రమైన స్పెషల్ ప్యాకేజీలు ఇచ్చారని జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ అన్నారు. ఆయా పరిశ్రమలకు భూ కేటాయింపులు విచిత్రంగా జరిగాయని ఆరోపించారు. మంగళగిరిలోని జనసేన కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో నాదెండ్ల మాట్లాడారు.

"రిటైల్ స్టోర్ మూసివేసే ముందు క్లియరెన్స్ సేల్ పెడతారు. వాళ్లు 70, 80 శాతం అని చెబుతుంటారు. ఉన్నవన్నీ అమ్మేసి దుకాణం మూసేస్తున్నామని మార్కెటింగ్ చేస్తుంటారు. అలాగే ఏపీ ప్రభుత్వం కూడా క్లియరెన్స్ సేల్ మొదలు పెట్టింది. గతంలో కొన్ని కంపెనీలకు భూములు కేటాయిస్తే వాళ్లు ఏర్పాటు చేయలేమంటూ రద్దు చేసుకున్నారు. ఆ కంపెనీలకే మళ్లీ ఇప్పుడు భూములు కేటాయిస్తున్నారు" అని నాదెండ్ల మనోహర్ ఆరోపించారు.

## ఈ నెల 18న జగన్ చేతుల మీదుగా..!



ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సారథ్యంలోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం మరో గుడ్‌న్యూస్ ఇచ్చింది. ఈ నెల 18వ తేదీ నుంచి కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టనుంది. రాష్ట్రవ్యాప్తంగా ఆరోగ్యశ్రీ కొత్త కార్డుల పంపిణీని చేపట్టనుంది. దీనికి అవసరమైన అన్ని ఏర్పాట్లు అధికారులు శరవేగంగా పూర్తి చేస్తోన్నారు.

ఆరోగ్యశ్రీ కింద 25 లక్షల రూపాయల వరకు ఉచితంగా వైద్య చికిత్సను ప్రభుత్వం అందించనున్న విషయం తెలిసిందే. దీనిపై తాజాగా వైఎస్ జగన్ తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు, ఏపీ వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్, ఆరోగ్యశ్రీ సీఈఓ డీకే బాలాజీ ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

రాష్ట్ర చరిత్రలో ఇదొక చరిత్రాత్మక నిర్ణయంగా, సువర్ణాధ్యాయంగా అభివర్ణించారు వైఎస్ జగన్. విద్య, వైద్యం ప్రజలకు ఒక హక్కుగా లభించాలని, దీనికోసం ఎన్ని వేల కోట్ల రూపాయలనైనా ఖర్చు చేయడానికి సిద్ధంగా ఉన్నామని అన్నారు. ఈ హక్కులను కాపాడాల్సిన కనీస బాధ్యత ప్రభుత్వంపై ఉందని చెప్పారు.

తాము అధికారంలోకి వచ్చిన తొలి రోజు నుంచే విద్య, వైద్యరంగాలను అభివృద్ధి చేయడానికి కృషి చేశామని గుర్తు చేశారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కింద ప్రభుత్వం చేస్తోన్న ఖర్చులే దీనికి ఉదాహరణ అని పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీ కింద 25 లక్షల రూపాయల వరకు ఉచితంగా వైద్య చికిత్సను అందించేలా నిర్ణయం తీసుకున్నామని అన్నారు.

ఆరోగ్యశ్రీ వినియోగంపై విస్తృతంగా (మిగతా 2లో)

## తుఫాను కారణంగా నష్ట పోయిన రైతులకు వెంటనే రాష్ట్ర ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలి



పాడేరు, (విశాఖ సమాచారమ్): మిచాంగ్ తుఫాను వలన నష్టపోయిన అల్లూరి సీతారామరాజు జిల్లా మరియు రాష్ట్రంలో రైతాంగానికి కనీస సాయాన్ని కూడా అందించకుండా దుర్మార్గంగా వ్యవహరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నాము అని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పంట దెబ్బతిన్న రైతులకు నష్టపరిహారం చెల్లించాలని బీజేపీ జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు వంతాల దేవదాసు అన్నారు, బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద బీజేపీ జిల్లా కిస్సాన్ మోర్చా అధ్యక్షుడు దేవదాసు ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నష్టపోయిన రైతులకు వ్యవసాయ పంటలకు, రైతులకు నష్టపరిహారం చెల్లించాలని ప్లకార్డులు ప్రదర్శిస్తూ ధర్నా చేసారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీజేపీ గిరిజన మోర్చా ఉపాధ్యక్షులు కె.వి.వి. సత్యనారాయణ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు పాంగి రాజారావు మాట్లాడుతూ తుఫాను హెచ్చరికలను నిర్లక్ష్యం చేసిన రాష్ట్ర ప్రభుత్వ వైఖరి దుయ్యబట్టారు. రాష్ట్ర ప్రభుత్వ రైతాంగ వ్యతిరేక విధానాలు ఆపాలని కోరారు. పంట నష్టం ప్రాథమిక నివేదిక కేంద్రానికి అందచేయాలని రాష్ట్ర ప్రభుత్వన్నీ కోరారు. వేలకోట్ల రూపాయలు పంట నష్టం జరిగితే అంచనాలు రూపొందించడంలో విఫలమైన రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. తడిచిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేయకుండా మీన మేషాలు లెక్కిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం వైఖరిని ఆయన ఖండించారు. తడిచిన ధాన్యం అయినకాడికి అమ్ముకొంటున్న రైతులు - చోద్యం చూస్తున్న రాష్ట్ర ప్రభుత్వం. రైతు పంట నష్టపోయిన ప్రతి ఎకరాకు నష్టపరిహారం అందించాలన్నారు జిల్లా అధ్యక్షుడు.

ఈ సందర్భంగా కిసాన్ మోర్చా పలు డిమాండ్‌లు చేశారు. పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఉదారంగా చెల్లించాలి. పత్తి, మిరప, పొగాకు, అరటి, పసుపు

(మిగతా 2లో)

## ఫేకర్ లేవుట్లో పార్కు ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేయండి




విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ జోన్-4 నందు గల ఫేకర్ లేఅవుట్ నందు పార్కు ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన పార్క్ ఏర్పాటుకు సంబంధించిన స్థలాన్ని ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు.

ఈ పరిశీలనలో ఫేకర్ లేఔట్ నందు రాయల్ గార్డెన్స్ అపార్ట్మెంట్స్ అనుకొని ఉన్న ఒక ఎకరం స్థలంలో పార్కు ఏర్పాటుకు ఇది వరకే ప్రణాళికలు సిద్ధం చేయడం జరిగిందని, అనివార్య కారణాల వలన ప్రతిపాదనలు పెండింగ్‌లో ఉన్నాయని కమిషనర్‌కు కార్యనిర్వాహణాధికారి పి.వి.వి.సత్యనారాయణ రాజు వివరించారు. పార్క్ ఏర్పాటుకు ముందుగా ఈ స్థలంలో రక్షణ కూడా నిర్మించాలని, పార్కు పూర్తి నిర్మాణంలో స్వచ్ఛందంగా భాగస్వాములు అవుతామని అందుకు ఆర్థికపరంగా ఇప్పటికే 20 లక్షల రూపాయలు వరకు తమ వంతుగా నివాసితులు సిద్ధం చేసి ఉంచారని, ఈ పార్క్ పూర్తి నిర్మాణం చేపట్టి ఫేకర్ లేఔట్ నివాసితులకు అందుబాటులో ఉంచాలని ఫేకర్ లేఔట్ నివాసిత సంఘ సభ్యులు కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు.

అనంతరం కమిషనర్ నివాసిత సంఘ సభ్యులతో కలిసి పార్కు స్థలాన్ని పూర్తిగా పరిశీలించి, ఎక్కువగా ఎత్తు పల్లాలతో ఈ స్థలం ఉన్నందున దీని నిర్మాణానికి ప్రత్యేకంగా ఆర్కిటెక్చర్ దగ్గర నుంచి ప్రణాళికలు సిద్ధం చేసి అందించాలని కమిషనర్ ఎస్.ఇ. రాజుకు ఆదేశించారు. పార్కు ప్రణాళికలు వచ్చిన తర్వాత తప్పకుండా పార్కు అభివృద్ధి చేసి నివాసితులకు అందుబాటులోనికి తీసుకొస్తామని సంఘ సభ్యులకు కమీషనర్ తెలిపారు.

ఈ పరిశీలనలో జోనల్ కమిషనర్ శివప్రసాద్, ఇఇ సంతోషి, ఏసీపీ వినయ్ ప్రసాద్, స్వచ్ఛ విశాఖ అంబాసిడర్ ప్రొఫెసర్ బాలమోహన్ దాస్, పలువురు నివాసిత సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీరస్తు శుభమస్తు అవిఘ్నమస్తు
పరమ గురువుల దివ్యాశీస్సులతో



కంచి పరమాచార్య శ్రీశ్రీశ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతీ మహాస్వామి వారు
బ్రహ్మర్షి శ్రీశ్రీశ్రీ 1011 బర్ఫానీ దాదాజీ
మాస్టర్ సి.వి.వి. గారు
మాస్టర్ ఇ.కె.గారు
మాస్టర్ ఎమ్.ఆర్.ఎల్.రావు గారు





బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మగారి ఆధ్వర్యంలో
శ్రీ కందాళ వేంకట సత్య శ్యామ్,
శ్రీమతి అరుణ గాయత్రి దంపతుల సంకల్పంతో
శ్రీరామ కోటి లేఖన యజ్ఞం మరియు కోటి హనుమాన్ చాలీసా పారాయణ
పూర్తయిన శుభసందర్భాన "హనుమత్ హోమం, శ్రీ సీతారామ కళ్యాణం"
కార్యక్రమానికి స్వాగతం



తేది : 15-12-2023 నుండి 17-12-2023 వరకు
హనుమత్ హోమం మరియు శ్రీ సీతారామ కళ్యాణం
కశింకోట గురువుగారు శ్రీ రేజేటి శ్రీరామాచార్యులు గారి ఆధ్వర్యంలో నిర్వహింపబడును
మీరంతా తప్పకుండా వచ్చి, ఈ శుభకార్యక్రమంలో పాల్గొని మీ గోత్ర, నామాలతో హనుమత్ పూజ చేయించుకొని, మీ స్వహస్తాలతో హోమగుండంలో సమిధలు సమర్పించుకొనవచ్చును.
తద్వారా శ్రీ సీతారామాంజనేయుల అనుగ్రహం పొందాలని ఆశిస్తున్నాము.
వేదిక : భద్రం కమ్యూనిటీ హాల్, సెక్టార్-6, యమ్.వి.పి.కోలని, విశాఖపట్టణం.

కార్యక్రమ వివరాలు
15-12-2023 ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు. (తదుపరి దేవతా ప్రసాదం - భోజనం)
15-12-2023 సా॥ 3 గంటల నుండి సా॥ 7 గంటల వరకు. (తదుపరి దేవతా ప్రసాదం - రాత్రి ఫలహారం)
16-12-2023 ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు. (తదుపరి దేవతా ప్రసాదం - భోజనం)
16-12-2023 సా॥ 3 గంటల నుండి సా॥ 7 గంటల వరకు. (తదుపరి దేవతా ప్రసాదం - రాత్రి ఫలహారం)
17-12-2023 ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు
పూర్ణాహుతి మరియు శ్రీ సీతారామ కళ్యాణం నిర్వహింపబడును. (తదుపరి దేవతా ప్రసాదం - భోజనం)

వివరములకు :
శ్రీమతి అరుణ గాయత్రి : 9160885953
శ్రీ డి.శ్రీనివాస్ : 81432 03157
శ్రీ వి. వి. ఆదినారాయణ మూర్తి : 95055 99930
శ్రీ సూరంపూడి వీరభద్ర రావు : 93939 49345
శ్రీ మారుతి : 99081 79090
శ్రీమతి కొడుకుల కృష్ణవేణి : 99125 60166

## (మొదటి పేజీ తరువాయిలు)

### పక్కా ప్లాన్‌తోనే పార్లమెంట్‌లో కలర్‌స్మోక్ దాడి

ఆ యువకుడు దూకుతున్న సమయంలో ఆ టేబుల్స్‌పై ఎంపీలు ఎవరూ లేరు. ఈ లోపు ఆ యువకుడు ఐదు టేబుల్స్ పై నుంచి జంప్ చేస్తూ ముందుకు దూకాడు. పట్టుకోండి, పట్టుకోండి అంటూ సభ్యులు అరిచారు. ఈ లోపు అప్రమత్తమైన ఎంపీలు అతన్ని చుట్టి ముట్టారు. ఈ లోపు పది మంది ఎంపీలు నాలుగు వైపులా నుంచి చుట్టుముట్టి ఆ యువకుడిని పట్టుకున్నారు. ఇదే సమయంలో మరో యువకుడు విజిటర్స్ గ్యాలరీ నుంచి సభలోకి దూకి కలర్ స్మోక్ వదలడం మొదలు పెట్టాడు. పసుపు రంగుతో కూడిన ఆ గ్యాస్ సభ అంతా నిండిపోయింది. ఆ గ్యాస్ చూసి చాలా మంది భయపడ్డారు. అయినప్పటికీ కొంత మంది ఎంపీలు తెగించి ఆ యువకుడిని కూడా పట్టుకున్నారు. ఈ ఇద్దరిని సాగర్ శర్మ, మనోరంజన్‌గా గుర్తించారు. షూ సోల్‌లో వీళ్లు ఆ కలర్ స్మోక్ క్యానిస్టర్స్‌ను పెట్టుకొని వచ్చినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. మైసూరు ఎంపీ ప్రతాప సింహా సిఫార్సు మేరకు ఈ ఇద్దరికి విజిటర్స్ పాస్ మంజూరు చేసినట్టు తెలుస్తోంది.

సరిగ్గా పార్లమెంట్‌లో ఈ ఘటన జరిగి ఎంపీలు బయటకు వస్తున్న సమయంలో మరో యువకుడు, ఒక మహిళను పార్లమెంట్ భద్రతా సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. వీళ్లిద్దరూ కూడా కలర్ స్మోక్ క్యానిస్టర్స్ పట్టుకొని ఎల్లో, రెడ్ కలర్ గ్యాస్ వదులుతూ కనిపించారు. పార్లమెంట్ లోపల జరిగిన ఘటన, బయట జరిగిన ఈ సంఘటన రెండూ ఒకదానితో ఒకటి ముడిపడిన ఘటనలుగా పోలీసులు అనుమానిస్తున్నారు. పార్లమెంట్ వెలుపల అదుపులోకి తీసుకున్న యువకుడు మహారాష్ట్రకు చెందిన 25 ఏళ్ల అన్‌మోల్ షిండేగా, మహిళ హర్యానాలోని హిస్సార్‌కు చెందిన 42 ఏళ్ల నీలమ్‌గా గుర్తించారు.

అదుపులోకి తీసుకున్న నలుగురు వ్యక్తులను ఢిల్లీ పోలీసులు, ఇంటెలిజెన్స్ అధికారులు విచారణ జరుపుతున్నారు. పార్లమెంట్‌లో భద్రతా వైఫల్యం జరిగిందని తెలియగానే కేంద్ర హోం శాఖ కార్యదర్శి అజయ్ భల్లా, ఢిల్లీ పోలీసు కమిషనర్ సంజయ్ అరోరా పార్లమెంట్ భవనానికి వచ్చారు. ఢిల్లీ పోలీసులకు చెందిన ఫొరెన్సిక్ టీమ్ కూడా పార్లమెంట్ భవనానికి చేరుకుని దర్యాప్తు చేస్తోంది.

సోషల్ మీడియాతో నలుగురికి పరిచయం ఏర్పడిందనీ ఆ తర్వాత పార్లమెంట్‌లో హంగామా చేయాలని ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది. సోషల్ మీడియాతో ఒక్కటైన సాగర్ శర్మ, మనోరంజన్, నీలమ్, అమోల్ షిండేగా పోలీసులు గుర్తించారు. అయితే, సాగర్‌శర్మ, మనోరంజ్‌కు విజిటర్స్ పాస్ ఇవ్వడంపై ఎంపీ ప్రతాప్ సిన్హా క్లారిటీ ఇచ్చారు. తన నియోజకవర్గానికి చెందిన వాళ్లు కావడంతో పాస్ ఇచ్చినట్టు వెల్లడించారు.

### శబరిమలలో భక్తుల రద్దీ -

దర్శించుకోకుండానే వెనుదిరుగుతున్నారు.

శబరిలమలో నెలకొన్న పరిస్థితుల పైన కేరళ ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. ఆలయంలో రద్దీని నియంత్రించడానికి అధికారులు తక్షణ చర్యలు తీసుకుంటున్నారని దేవదాయ శాఖ మంత్రి కె.రాధాకృష్ణన్ తెలిపారు. నిర్దేశిత ప్రవేశ మార్గాలు కాకుండా వివిధ ప్రాంతాల గుండా భక్తులు కొండపైకి ఎక్కుతున్నారు. యాత్రికులను వెంబడించి పట్టుకోలేమనీ, కానీ ఇప్పుడు పరిస్థితులు అదుపులోకి వచ్చాయన్నారు. ఈ అంశాన్ని రాజకీయం చేయవద్దనీ, పరిస్థితిని సాధారణ స్థితికి తీసుకు రావడానికి సహకరించాలని కోరారు. దీని పైన కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ స్పందించారు. ప్రభుత్వం శబరిమలకు వచ్చే భక్తులకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని వెల్లడించారు.

శబరిమల అభివృద్ధికి 220 కోట్ల రూపాయలు ఖర్చు చేశామని తెలిపారు. రోజుకు 1.20 లక్షల మంది భక్తులు దర్శించుకుంటున్నారని ముఖ్యమంత్రి చెప్పారు. ఏపీ, తెలంగాణ, తమిళనాడు నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వస్తున్న దృష్ట్యా దర్శన సమయాన్ని మరో గంట పెంచాలని ఆలయ అధికారులు నిర్ణయించారని కేరళ ప్రభుత్వం ప్రకటించింది.

### ఈ నెల 18న జగన్ చేతుల మీదుగా..!

ప్రచారం చేయాలని జగన్ ఆదేశించారు. ఆరోగ్యశ్రీ సేవలను ఎలా వినియోగించుకోవాలన్న అంశంపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని, ఈ విషయంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్ల సహకారాన్ని తీసుకోవాలని సూచించారు. ఎమ్మెల్యేలు సైతం ఈ కార్యక్రమంలో చురుగ్గా పాల్గొనాలని అన్నారు.

### తుఫాను కారణంగా నష్ట పోయిన రైతులకు వెంటనే రాష్ట్ర ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలి

పంటలకు ఎకరాకు రూ.50 వేలు నష్టపరిహారం చెల్లించాలి. ఉద్యానవన పంటలకు ఎకరాకు లక్ష రూపాయల సాయం అందించాలి. డ్రైనేజ్ కాలువలను వెంటనే ఆధునీకరించాలి. పంట కోల్పోయిన రైతుల పంటరుణాలను మాఫీ చేయాలి. ఎరువులు, విత్తనాలను రైతులకు ఉచితంగా అందించాలి. ప్రతి రైతుకు పంటల బీమా అమలయ్యేలా రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహించాలి డిమాండ్ లు చేశారు, అనంతరం జిల్లా కలెక్టర్ ఏవోకి మెమోరాండం అందచేశారు, ఈ కార్యక్రమంలో బీజేపీ పాడేరు, రంపచోడవరం, అరకు అసెంబ్లీల కన్వీనర్‌లు కుడా కృష్ణారావు, బుల్లి కొండలు, ధర్మరాజు, బీజేపీ మైనారిటీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి రవికుమార్ పెనుమాక, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మఠం శాంతకుమారి, కురుసా రాజారావు, జైతే ప్రభాకర్, బీజేపీ సీనియర్ నాయకురాలు కురుసా పార్వతమ్మ, యువ మోర్చా నాయకులు లకే భాస్కర్, మహిళా మోర్చా అధ్యకురాలు తంగుల సత్యవతి, మైనారిటీ మోర్చా జిల్లా అధ్యక్షుడు పాపిటి రాజు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు రాఘవేంద్రరావు, సల్లా రామకృష్ణ, ఆనంద్, రమణ, రైతులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## గాజువాక జోన్‌లో అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయండి



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): మహా విశాఖ నగర పాలక సంస్థ జోన్-6 గాజువాక పరిధిలో పలు అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన గాజువాక జోన్ నందు అభివృద్ధి పనులు చేపట్టనున్న పలు ప్రాంతాలలో జోనల్ కమీషనర్ పి.సింహాచలం, ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ అధికారులతో కలసి పరిశీలించారు. ముందుగా 65వ వార్డ్ లో గల రాజీవ్ క్రీడా ప్రాంగణం, వికాస్ నగర్ లో కల్వర్ట్, జగ్గు జంక్షన్ లో కణితి 100 ఫీట్ రోడ్, సుందరయ్య కాలనీ హెడ్ వాటర్ వర్క్స్ పంపింగ్ స్టేషన్, బి.సి.రోడ్, నడుపూరు 100 ఫీట్ రోడ్, గాంధీ నగర్ బ్రిడ్జి, తదితర ప్రాంతాలలో పరిశీలించిన అనంతరం గాజువాక జోనల్ కార్యాలయం లో అధికారులతో కలసి అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు.

ఈ సమీక్షలో కమీషనర్ మాట్లాడుతూ, రాజీవ్ క్రీడా ప్రాంగణంలో చిల్డ్రెన్ ప్లే ఏరియా, పార్క్, స్పోర్ట్స్ కోర్ట్స్, ఓపెన్ జిమ్, వాకింగ్ ట్రాక్, కాంపౌండ్ వాల్ చుట్టూ నీడ నిచ్చే మొక్కలను వేయడానికి పనుల మంజూరు కొరకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కార్యనిర్వాహక ఇంజనీర్ గోవింద రావు ని ఆదేశించారు. కణితి రోడ్‌లో జరుగుతున్న 2 కిలోమీటర్ల కాలువ పనులను డిసెంబర్ 31 నాటికి పూర్తి చేయాలన్నారు. బి.సి. రోడ్ లో వీధి లైట్ లు రిపేర్ చేసి సెంటర్ మీడియన్లకు, విద్యుత్ పోల్స్ నకు పెయింటింగ్ లు వేయాలన్నారు. వికాస్ నగర్ బ్రిడ్జి వద్ద వర్షాలకు కాలువ నీరు పొంగి పొర్లుతుండడం వలన అక్కడ ఎత్తుగా రోడ్ వేసి బ్రిడ్జి ని మరమత్తు చేయాలన్నారు. 130 అడుగుల ఉడా రోడ్ లో సెంటర్ మీడియన్ రిపేర్, పెయింటింగ్ లు వేసి అక్కడ ఆక్రమణలు లేకుండా చేయమన్నారు. నడుపూరు 130 అడుగుల రోడ్ లో వున్న కాంపౌండ్ వాల్‌ని ఎత్తుగా నిర్మించాలన్నారు. సిద్దేశ్వరం రోడ్ లో డ్రైన్ లను, ఫుట్ పాత్ లను డిసెంబర్ 25 లోగా పూర్తి చేయాలన్నారు. జోనల్ ఆఫీస్ నుండి 100 అడుగుల రోడ్డులో ఒక లేయర్ బి.టి. రోడ్ వేసి డ్రైన్ లను వెడల్పు చేయాలన్నారు. గంగవరం రోడ్డుకు ఇరువైపులా కాలువలు నిర్మించా లన్నారు. తుంగ్లాంలో గల 2 ఎకరాల స్తలంలో ఇండోర్ స్టేడియం, వాకింగ్ ట్రాక్, బౌండరీ వాల్ చుట్టూ మొక్కలు వేయుటకు, అలాగే సిద్దార్థ నగర్ లో 4 ఎకరాల స్థలంలో ఇండోర్ స్టేడియం, పార్క్‌లు ఏర్పాటు చేయుటకు ప్రణాలికలు సిద్ధం చేయాలన్నారు. పేదగంట్యాడ, గాజువాకలో ఉన్న శ్మశాన వాటికలను అభివృద్ధి చేయుటకు డిజైన్లు తయారు చేసి ప్రణాలికలు సిద్ధం చేయాలన్నారు. 75వ వార్డ్‌లో పోలమాంబ గుడివద్ద కల్వర్ట్ నిర్మించుటకు ప్రణాలికలు సిద్ధం చేయాలన్నారు. కల్వర్ట్ లు కింద పైప్ లైన్లు గాజువాక జోన్ లో ఎన్ని చోట్ల వున్నాయని, నీరు కలుషితము కాకుండా వాటిని ప్రత్యేకంగా వేరు చేసి పైప్ లైన్లు వేసేందుకు ప్రణాలికలు సిద్ధం చేయాలని ఎస్.ఇ. కె.వి.ఎన్.రవిని ఆదేశించారు. రోడ్ విస్తరణలో అడ్డంకాలను తొలగించాలని, పోస్టర్స్ ఎక్కడ కూడా అంటిస్తే వాటిపై చర్యలు చేపట్టాలని సి.సి.పి. సురేష్ ని ఆదేశించారు. ఇకపై ప్రతి వారం గాజువాక అభివృద్ధి పనులను స్వయంగా పరిశీలిస్తానని, మంజూరు కోసం ప్రతిపాదనలని తనకి వెంటనే సమర్పించాలని అధికారులను ఆదేశించారు. రాజీవ్ క్రీడా ప్రాంగణం పరిశీలనలో ఆ వార్డ్ కార్పొరేటర్ బొడ్డు నరసింహ పాత్రుడు పాల్గొని రాజీవ్ క్రీడా ప్రాంగణాన్ని అందంగా తీర్చిదిద్ది ప్రజలకు త్వరితగతిన అందుబాటు లోనికి తీసుకురావాలని అధికారులను సూచించారు. ప్రతిపాదిత స్టేడియంలో పార్క్ లలో మంచి నీడని ఇచ్చేటివంటి, గుబురుగా పెరిగే మొక్కలని వేయాలని డి.డి.ఆర్. దామోదరరావును ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో ఇ.ఇ. ప్రసాద్ బాబు, ఎ.ఎం.ఒ.హెచ్. కిరణ్ కుమార్, సి.పి. దొర, టి.పి.ఒ. రేవతి, తదితరులు పాల్గొన్నారు.


## కెజిహెచ్‌కి సందర్శించిన ఆరోగ్యశాఖాధికారి జగదీశ్వర రావు



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.పి.జగదీశ్వర రావు, కింగ్ జార్జ్ హాస్పిటల్ లో గల ప్రత్యేక పిల్లల వార్డు SNCU, NICU లను సందర్శించి అక్కడ ఉద్యోగులు మరియు పరికరాల ఆవశ్యకత గురించి అక్కడ గల HOD డా.రాజు, చిన్న పిల్లల నోడల్ అధికారి వారితో చర్చించి అవసరమైన సామాగ్రి సమకూర్చే ఏర్పాట్లు చేసుకోవాలని మరియు సిబ్బంది OP స్టాటిస్టిక్స్, FRS మరియు స్టాఫ్ పొజిషన్ గురించి పలు సూచనలు చేశారు. 4Ds రిఫరల్స్ మరియు ఫాలోఅప్ సేవలు అందించాలని తెలియచేసారు. తదుపరి (184) పైందరిపేట వార్డ్ 1 సచివాలయంలో IMI సెషన్ మానిటరింగ్ చేసారు. 12 వారాల లోపు గర్భిణీ స్త్రీల నమోదు చేయాలని, హై రిస్క్ గర్భిణీలను గుర్తించి డాక్టర్ సలహాలు తీసుకోవాలని మరియు ఎనిమియా మానిటరింగ్ టెస్ట్ చేయాలని, అన్ని ఆరోగ్య ఉప కేంద్రములలో ఉన్న గర్భిణీల నమోదు 100 శాతం అయ్యేటట్లు చూడాలని ఆదేశించారు. పట్టణ ఆరోగ్య కేంద్రం యొక్క వైద్యులకు మరియు ANMs కు, స్టాఫ్ నర్సలకు, ఆశాలకు డ్రెస్ కోడ్ పాటించాలని ఆదేశించారు. గర్భిణీలను గుర్తించి టి.టి. అందచేయాలని, మరియు హై రిస్క్ గర్భిణీలను గుర్తించి డాక్టర్స్ సలహా నిమిత్తం ఐరన్ ఫోలిక్ మాత్రలు మరియు పోషకాహారం తీసుకునేటట్లు ప్రోత్సహించాలి. చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు ప్రణాళిక వేసుకుని సమయాను కూలంగా శత శాతం అయ్యేటట్లు చూడాలని ఆదేశించారు. క్షేత్ర స్థాయి సిబ్బంది సందర్శనకి వెళ్ళినప్పుడు మూవ్మెంట్ రిజిస్టర్‌లో వివరాలు నమోదు చేసి వెళ్ళవలెను అని ఆదేశించారు.

ఈ సందర్శనలో డా.బి.ఉమావతి, జిల్లా నోడల్ అధికారి, ఆరోగ్య కేంద్ర వైద్యులు, సిబ్బంది మరియు నాగ భూషణం, MPHEO పాల్గొన్నారు.

## ఎర్రయ్యదొరకు శుభాకాంక్షల వెల్లువ




యలమంచిలి, (విశాఖ సమాచారమ్): యలమంచిలి నియోజకవర్గ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా బుధవారం నాడు ప్రమాణ స్వీకారం చేసిన బొద్దపు ఎర్రయ్య దొరను ఎంపీపీ బోదెపు గోవింద్, వైస్ ఎంపీపీ రాజాన శేషు, పట్టణ మున్సిపాలిటీకి చెందిన ఎర్రవరం వార్డు కౌన్సిలర్ పిట్టా సత్తిబాబు ఇతర కౌన్సిలర్లు కిరణ్, సుంకర మరనీశ్వరావు, దాసరి చిన్నమ్మలు, సచివాలయ కన్వీనర్ కర్రి శివ, వైసిపి రూరల్ పార్టీ కన్వీనర్ కొల్లి త్రినాధ్, వైసీపీ పట్టణ, మండల నాయకులు సేనాపతి రాము, ప్రతాప్ బాబ్, పిల్లా త్రినాధ్(డాక్టర్), మర్రి రాజు, దాసరి కుమార్, రాంబిల్లి ఎంపీపీ జి.శిరీష, శ్రీనుబాబు, జెడ్పిటిసి దూళి నాగరాజు, అచ్యుతాపురం ఎంపీపీ, జెడ్పిటిసిలు ఇతర ప్రజాప్రతినిధులు, రామ్ నగర్, పెదపల్లి వార్డుల ఎర్రయ్య దొర అభిమానులు పడాల శ్రీను, దాసరి గణేష్, రాజు, రాంబాబు, సత్తిబాబు, సతీష్ తదితరులు ఆయనను ఘనంగా సన్మానించారు.

## పిల్లలు, గర్భిణీలకు టీకాలు వేసి లక్ష్యాన్ని పూర్తి చేయాలి

పార్వతీపురం, (విశాఖ సమాచారమ్): మిషన్ ఇంద్రధనుష్ టీకా కార్యక్రమాన్ని ఎమ్ఆర్ నగరంలో డబ్ల్యుహెచ్ఓ ఎస్ఎమ్ఓ డాక్టర్ జాన్ జూడ్ జాషువా, జిల్లా హెల్త్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి. జగన్మోహన రావు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. టీకా కేంద్రంలో రికార్డులు, టీకా కార్డులు, వ్యాక్సిన్, అత్యవసర మందుల కిట్ మొదలగునవి పరిశీలించి టీకా మార్గదర్శకాలను ఏ మేరకు అమలు చేస్తున్నారో చెక్ లిస్ట్ ప్రకారం పరిశీలించారు. టీకా వేసిన పిల్లల వివరాలు వారి వయస్సు పరిశీలించి, యూవిన్ పోర్టల్‌లో ఆన్లైన్ చేస్తున్న విధానాన్ని తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. మిషన్ ఇంద్రధనుష్ కార్యక్రమాన్ని ఈ శనివారం వరకు కొనసాగించాలని ఇంకా టీకా వేయాల్సిన పిల్లలు,గర్భిణీలకు టీకా వేసి ఇవ్వబడిన లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓ వెంకట నాయుడు, ఏఎన్ఎమ్ పొలమ్మ, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పంచాంగం

గురువారం 14-12-2023
శోభకృత్ నామ సంవత్సరము
దక్షిణాయణం శరదృతువు
మార్గశిర మాసం

తిథి : శు. విదియ రా. 02.45
నక్షత్రం : మూల ఉ. 11.33
వర్జ్యం : ఉ. 10.00 ల 11.33

## ఏపీకి మరో తుఫాన్ ముంచుకొస్తుందని వాతావరణ శాఖ అంచనాలు



ఆంధ్రప్రదేశ్‌కు తుపాను రూపంలో మరో ముప్పు పొంచి ఉందా? తీవ్ర నష్టం కలిగించే అవకాశం ఉందా? అంటే అవుననే అంటోంది వాతావరణ శాఖ. మిచౌంగ్ తుఫాన్ ఎఫెక్ట్‌తో పంటలు దెబ్బతిని రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. వరద బాధితులను ఆదుకోవడంతో పాటు పంట నష్టాన్ని ప్రభుత్వం అంచనా వేస్తుండగానే గండం మరో తుఫాన్ రూపంలో ముంచుకొస్తుందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ వార్నింగ్ బెల్స్ రైతులను మరింత ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఇటీవల మిచౌంగ్ తుఫాన్ తెలుగు రాష్ట్రాలపై తీవ్ర ప్రభావం చూపింది. తాజాగా మరో తుఫాన్ రైతులను భయపెడుతోంది. 24 గంటల్లో అల్పడనంగా ఏర్పడనుంది. రానున్న ఐదు రోజుల పాటు కేరళ, తమిళనాడు, పుదుచ్చేరిలతో పాటు పలు రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది.

## ఎన్.హెచ్.ఆర్.సి. స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ గా జీ.వి. రమణారావు



పార్వతీపురం, (విశాఖ సమాచారమ్): పార్వతీపురం పట్టణానికి చెందిన రాష్ట్ర లారీ ఓనర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు గొర్లి వెంకట రమణారావు (ఈనాడు రమణ) జాతీయ మానవ హక్కుల కమిటీ (ఎన్. హెచ్.ఆర్.సి) స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా నియామకమైనట్లు ఎన్.హెచ్.ఆర్.సి. పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షులు వంగల దాలి నాయుడు తెలిపారు. ఈ మేరకు బుధవారం పార్వతీపురం లారీ ఓనర్స్ యూనియన్ అసోసియేషన్ కార్యాలయంలో నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెన్.హెచ్.ఆర్.సి. రాష్ట్ర అధ్యక్షులు, జాతీయ ఉపాధ్యక్షులు కదిరి రాము ఆధ్వర్యంలో గత ఆదివారం విశాఖపట్నంలో జరిగిన రాష్ట్ర కమిటీ ఎన్నికల్లో భాగంగా జీవి రమణారావును ఎన్.హెచ్.ఆర్.సి.స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ గా నియమించినట్లు తెలిపారు. గతంలో రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో పలు ముఖ్యమైన పదవుల తనదైన శైలిలో నిర్వర్తించిన రమణారావు జాతీయ మానవ హక్కుల కమిటీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా నియమింపబడటం ఆనంద దాయకమన్నారు. జిల్లాలో, రాష్ట్రంలో ఎక్కడైనా, ఎప్పుడైనా మానవ హక్కులకు భంగం కలిగిన నేపథ్యంలో బాధితులకు అండగా నిలబడాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కొత్తగా నియమింప బడిన జీవీ రమణారావు మాట్లాడుతూ తనపై నమ్మకంతో స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర ప్రెసిడెంట్ కదిరి రాముకు, కమిటీ ప్రతినిధులకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా తనకు అప్పగించిన బాధ్యతను తన శక్తి వంచన లేకుండా నిర్వర్తిస్తానన్నారు.

## నారా లోకేష్‌కి ఘన స్వాగతం పలికిన జనసేన నాయకులు

యలమంచిలి, (విశాఖ సమాచారమ్): టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, యువగళం సారధి నారా లోకేష్ తన 221వ రోజు పాదయాత్ర నియోజకవర్గములో గల యలమంచిలి మండలం పులపర్తికి చేరుకుంది. ఈ సందర్భంగా టీడీపీ-జనసేన పొత్తులో భాగంగా జనసేన పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, యలమంచిలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ సుందరపు విజయ్ కుమార్, ఇటీవలే జనసేన రాష్ట్ర అధ్యక్షుడు ఆధ్వర్యంలో పార్టీలో జాయన్ అయిన సుందరపు సతీష్‌లు బుధవారం పులపర్తి జాతీయ రహదారి వద్ద లోకేష్‌కి పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన లోకేష్‌తో మాట్లాడుతూ నియోజకవర్గములో యువగళం పాదయాత్ర జరిగినన్ని రోజులు తమ పార్టీ నాయకులు, కార్యకర్తలు, జనసైనికులు పాదయాత్రలో ఉత్సాహంగా పాల్గొంటారన్నారు. నారా లోకేష్ కి స్వాగతం పలికిన వాళ్లలో యలమంచిలి టౌన్ జనసేన అధ్యక్షులు బొద్దపు శ్రీనివాస్, రూరల్ అధ్యక్షులు లాలం సోము నాయుడు, రాంబిల్లి జనసేన అధ్యక్షులు పప్పల నూకన్నదొర పార్టీ సీనియర్ నాయకులు గుర్రాల శేఖర్, సమన్వయ కమిటీ మెంబర్ కొఠారు నరేష్, వీర మహిళలు, కార్యకర్తలు, జన సైనికులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# విశాఖ సమాచారమ్

గురువారం 14-12-2023


## మార్గశిర మాసం విశిష్టత

కార్తీక మాసం నుంచి నేడు మార్గశిర మాసంలో అడుగు పెడుతున్నాం. హేమంత ఋతువులోని మొదటి మాసం మార్గశిరం. ఈ మాసం గురించి శ్రీకృష్ణ పరమాత్ముడు. మాసానాం మార్గశీర్షాహం. మాసాలలో మార్గశిర మాసాన్ని నేనే అని స్వయంగా చెప్పాడు.

హిందూ సంప్రదాయాల ప్రకారం తెలుగు నెలల్లోని ప్రతి ఒక్క నెలకు ఒక్కో ప్రత్యేకత ఉంది. అయితే అన్ని మాసాల న్నింటిలోనూ మార్గశిర మాసానికి ఎంతో విశిష్టత, ప్రత్యేకత ఉంది. మార్గశిర మాసాన్నే 'మార్గశీర్షం' అని కూడా పిలుస్తారు. శీర్షం అంటే అగ్రభాగం అని అర్థం. మాసాలన్నింటిలో అగ్రగణ్యమైనది కాబట్టే దీనికి ఈ పేరు వచ్చింది. అంతేకాదు మార్గశీర్షం ఒక విలక్షణమైన మాసం. అంటే మార్గాలలో శ్రేష్టమైనది. అది ఏ మార్గం అంటే భగవంతుని అనుగ్రహం పొందు భక్తి మార్గం.శ్రీమహా విష్ణువుకు ఎంతో ప్రీతికరమైన మాసం మార్గశిరం. శ్రీమన్నారాయణుడి ఆరాధనతోపాటూ పలు పర్వదినాల సమాహారం మార్గశిర మాసం. మహావిష్ణువుకు ఎంతో ప్రీతికరమైన ఈ మాసంలో చేసే లక్ష్మీపూజలూ, ఉండే ఉపవాసాలతో సకల శుభాలు కలుగు తాయని చెబుతున్నాయి శాస్త్రాలు.

ఇదే విషయాన్ని 'గీత'లో శ్రీకృష్ణుడు అర్జునుడికి చెప్పినట్లు పండితులు చెబుతున్నారు. ఈ సందర్భంగా ఈ మాసం యొక్క విశేషాలు, ప్రాముఖ్యత, విశిష్టతతో పాటు మరికొన్ని ఆసక్తికరమైన విషయాలను తెలుసుకుందాం. మార్గశిరం అంటే 'బృహత్సామ తథాసామ్నాం గాయత్రీ ఛందసా మహం మహం మాసానాం మార్గశీర్షోహ రుతూనాం కుసుమాంకం'

అనే శ్లోకంలో మార్గశీర్షాన్ని నేనే, ఆరు రుతువులలో పుష్ప సౌరభం నేనే, సామవేదానికి చెందిన గానాలలో బృహత్సామాన్ని నేనే, ఛందస్సులో గాయత్రీ ఛందాన్ని నేనే, శోభ అధికంగా ఉండే వసంతకాలాన్ని నేనే అని భగవద్గీతలోని విభూతి యోగంలో ఆ కృష్ణ భగవానుడే వివరించాడు. మొత్తానికి మార్గశిరం అంటే నేనేనని చెప్పుకున్న మాసమన్నమాట.

హిందువులందరికీ 'భగవద్గీత' జన్మించిన మాసంగా పరిగణించే పవిత్రమైన మాసం. ఈ మాసమంతా శ్రీమహా విష్ణువును తులసీదళంతో పూజిస్తే పుణ్యం దక్కుతుందని పండితులు చెబుతుంటారు. మార్గశిర మాసం ఎన్ని పర్వాలకు నెలవుగా పరిగణిస్తారు. తెలుగు రాష్ట్రాల్లో మార్గశిర శుద్ధ ఏకాదశిని 'వైకుంఠ ఏకాదశి' అని దీనినే 'మోక్ష ఏకాదశి' అనీ అంటారు. ఈ పర్వదినాన వైష్ణవ ఆలయాల్లో ఉత్తర ద్వారం నుండి వెళ్లి దేవున్ని దర్శనం చేసుకుంటే మోక్షం లభిస్తుందని చాలా మంది భక్తుల నమ్మకం. ఈ ఏకాదశి నాడే గీతా జయంతి, సమస్త మానవాళికి ధర్మభాండాగారం అయిన భగవద్గీతను క్రిష్ణుడు ప్రబోధించిన రోజు. ఇలా ఎన్నో విశిష్టతలతో భక్తులందరికీ హర్షం ఇచ్చేదే మార్గ శీర్ష మాసం.

ఈ జగత్తులోని అన్నింట్లో తాను ప్రకటితమైనప్పటికీ కొన్నింట్లో తన స్వరూపం స్పష్టంగా తెలుస్తుందనీ, అలాంటి కొన్నింట్లో ఈ మాసం కూడా తన స్వరూపమేననీ చెబుతాడు కృష్ణుడు. ఈ నెలలో లక్ష్మీ నారాయణుడిని తులసీదళంతో పూజించడం పుణ్యప్రదమని అంటారు. ఆధ్యాత్మికంగా మానసిక శక్తిని ఇచ్చే ఈ మాసంలో వచ్చే గురువారాల్లో మహాలక్ష్మిని పూజిస్తే ఆయురారోగ్యాలూ, సిరిసంపదలూ వృద్ధి చెందుతాయని చెబుతున్నాయి పురాణాలు. ఈ నెలలో ప్రతిరోజూ శుభ ప్రదమైనదే అయినా మరికొన్ని ప్రత్యేకమైన పర్వదినాలూ ఉన్నాయి. మార్గశిర తదియ నాడు కొన్ని ప్రాంతాల్లో శివపార్వతుల వ్రతం చేసే ఆచారం ఉంది. ఈ మాసంలో వచ్చే షష్ఠిని స్కంద/సుబ్రహ్మణ్య షష్ఠి అంటారు. శివపార్వతుల కుమారుడైన సుబ్రహ్మణ్యుడు తారకాసుర సంహారం కోసం అవతరించిన దినమే సుబ్రహ్మణ్యషష్ఠి. అలాగే మార్గశిర శుద్ధ అష్టమిని కాలభైరవ అష్టమి అని అంటారు. ఈశ్వరుడు కాలస్వరూపంగా ప్రకటితమైన అవతారం ఇది. కాలభైరవుడు కాశీపట్టణానికి క్షేత్రపాలకుడిగా ఉంటూ అక్కడ మరణించిన భక్తుల పాపపుణ్యాలు స్వయంగా లెక్కిస్తుంటాడని చెబుతారు. శునకం కాలభైరవ స్వరూపం కాబట్టి ఈ రోజున శునకాన్ని పూజించి, గారెల దండను శునకం మెడలో వేస్తే మంచిదని చెబుతారు. ఈ నెలలో వచ్చే త్రయోదశినాడు ద్రౌపది హనుమంతుడి వ్రతాన్ని చేసిందని చెబుతున్నాయి శాస్త్రాలు. దీన్ని వేదవ్యాసుడు ధర్మరాజుకు చెబితే ధర్మరాజు ద్రౌపది చేత ఆ వ్రతం చేయించాడట. దక్షిణాయనానికి చివర, ఉత్తరాయనానికి ముందుండే ధనుర్మాసం ఆరంభం అయ్యేది కూడా ఈ మాసంలోనే. ధనుర్మాసం అంటే దివ్య ప్రార్థనకు అనువైన మాసం అని అర్థం. సూర్యుడు ధనుస్సు నుంచి మకర రాశిలోకి ప్రవేశించే వరకూ అంటే భోగి వరకూ ఈ ధనుర్మాసం కొనసాగుతుంది. ఈ మాసంలో ఆండాళ్ పూజ, తిరుప్పావై పఠనం, గోదా కల్యాణం మొదలైనవాటికి అధిక ప్రాధాన్యం ఉంటుంది. ఈ కాలంలో తిరుమల శ్రీవారి ఆలయంలో సుప్రభాతానికి బదులుగా తిరుప్పావై పఠనం చేస్తారు. ఈ నెలలో సాధారణంగా విష్ణు ఆలయాల్లో స్వామికి అర్చన చేసి ఆ ప్రసాదాన్ని పిల్లలకు ప్రత్యేకంగా పంచుతారు. అలా పంచడాన్ని బాలభోగం అంటారు. కొందరు వైష్ణవులు మార్గశిర పౌర్ణమి తర్వాత వచ్చే పాడ్యమి నుంచి ధనుర్మాస వ్రతాన్ని చేసుకోవడం ఓ సంప్రదాయమే.

ఏడాదిలో వచ్చే ఇరవైనాలుగు ఏకాదశి తిథుల్లో ప్రతిదీ పవిత్రమైనదైనా వీటన్నింటిల్లో వైకుంఠ ఏకాదశి మాత్రం ఉండదు. ఎందుకంటే అన్ని ఏకాదశుల్నీ చంద్రమానం ప్రకారం గణిస్తే వాటికి భిన్నంగా వైకుంఠ ఏకాదశిని సౌరమానం ప్రకారం గణిస్తారు. సూర్యుడు ఉత్తరాయనానికి మారే ముందు వచ్చే ధనుర్మాస శుద్ధ ఏకాదశినే ముక్కోటి ఏకాదశి అంటారు. 'వైకుంఠ ఏకాదశి', 'ముక్కోటి ఏకాదశి', 'స్వర్గద్వార ఏకాదశి', 'మోక్ష ఏకాదశి' అంటూ పిలిచే ఈ ఏకాదశి రోజునే శ్రీమహావిష్ణువు కొలువై ఉన్న వైకుంఠంలోని వాకిళ్లు తెరుచుకుంటాయని అంటారు.

దక్షిణాయనంలో యోగనిద్రలోకి వెళ్లిన నారాయణుడు కార్తిక శుద్ధ ఏకాదశిరోజున మేల్కొంటాడు. అలా మేల్కొన్న స్వామిని దర్శించుకునేందుకు ముక్కోటి దేవతలూ మార్గశిర మాసంలో వచ్చే ఏకాదశి రోజున వైకుంఠానికి చేరుకుంటారు. అందుకే దీన్ని ముక్కోటి ఏకాదశి అని పిలుస్తారు. ఈ రోజున ఉత్తర ద్వారంలో శ్రీమన్నారాయణుడిని దర్శించుకుంటే స్వర్గలోకప్రాప్తి కలుగు తుందని భక్తుల నమ్మకం. అలాగే మార్గశిర శుద్ధ ఏకాదశి భగవద్గీత లోకానికి అందిన రోజు కూడా. ఇలా ఎన్నో ప్రత్యేకతలున్న ఈ మాసంలో మహావిష్ణువును భక్తిశ్రద్ధలతో పూజిస్తే ఆయురారోగ్యాలతో పాటూ సిరిసంపదలూ కలుగుతాయని భక్తుల నమ్మకం.

## ఈనెల 15 పాడేరులో మెగా జాబ్ మేళా



**పాడేరు, (విశాఖ సమాచారమ్):** స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల 15 (శుక్రవారం) వ తేదీన మెగా జాబ్ మేళా ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని ఐటిడి ఏ పిఓ వి. అభిషేక్ స్పష్టం చేసారు.

బుధవారం ఆయన క్యాంపు కార్యాలయంలో జాబ్ మేళా గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబ్ మేళాలో లైఫ్ సర్కిల్ హెల్త్ సర్వీసెస్ ప్రైవేటు లిమిటెడ్, జి. ఎం. ఆర్ రక్షా సెక్యూరిటీ, అపోలో ఫార్మసీ, కేర్ ఫర్ యు, డెక్కన్ ఫైన్ కెమికల్స్, మోహన్ స్పిన్టెక్స్ ప్రైవేట్ లిమిటెడ్, పై ఎస్ కె ఇన్ఫోటెక్, ఈకాం ఎక్స్ప్రెస్, నవతా రోడ్ ట్రాన్స్పోర్ట్స్, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ వంటి ప్రముఖ సంస్థలు జాబ్ మేళాలో పాల్గొంటున్నాయని పేర్కొన్నారు. పది నుండి పదిహేను వేల రూపాయలు వరకు జీతాలు చెల్లిస్తారని చెప్పారు. 10వ తరగతి నుండి పిజీ వరకు, ఐటిఐ నుండి డిప్లొమో, ఇంజనీరింగ్ చదువుకున్న యువతీ యువకులు ఈ జాబ్ మేళాకు హాజరై ఉద్యోగాలను సాధించాలని సూచించారు. గిరిజన నిరుద్యోగ యువత జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 0401786463, 9308338105 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఎస్ డి ఓ జి. ప్రశాంత్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్యం : శత శాతం పది ఫలితాలు




**పార్వతీపురం, (విశాఖ సమాచారమ్):** రానున్న పదవ తరగతి పరీక్షల్లో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో శత శాతం ఫలితాలు లక్ష్యంగా పనిచేయాలని పార్వతీపురం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సి. విష్ణు చరణ్ అన్నారు. పదవ తరగతి పరీక్షల సన్నాహాలపై గిరిమిత్ర సమావేశ మందిరంలో బుధవారం అకడమిక్ మానిటరింగ్ అధికారులు, ఏటిడబ్ల్యుఓలు, ప్రధాన ఉపాధ్యాయులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు అధికారి మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి ఉత్తీర్ణత సాధించాలన్నారు. శత శాతం లక్ష్యంగా పనిచేయాలని, ఇందుకు 60 రోజుల కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఆయన ఆదేశించారు. సబ్జెక్టు వారీగా గల రిసోర్స్ పర్సన్లు ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన స్పష్టం చేశారు. కార్యాచరణలో రోజు వారి, అంశం వారీగా ఉండాలని, సంబంధిత బ్లూ ప్రింట్ తయారు చేయాలని ఆయన సూచించారు. 60 రోజుల కార్యాచరణ నిర్వహణపై ప్రధాన ఉపాధ్యాయులు కచ్చితమైన అవగాహన, శ్రద్ధ వహించాలని ఆయన స్పష్టం చేశారు. ప్రతి ఉపాధ్యాయునికి, విద్యార్థికి కార్యాచరణ ప్రణాళిక తెలియాలని అన్నారు. పాఠ్యాంశాల పునశ్చరణ తరచూ జరగాలని, స్లిప్ టెస్ట్ లు నిర్వహించాలని ఆయన ఆదేశించారు. లఘు ప్రశ్నలు, బిట్లపై తగిన తర్ఫీదు కల్పించాలని ఆయన సూచించారు. అత్యవసర పరిస్థితులలో మినహా ఉపాధ్యాయులు సెలవులు వినియోగించుకోరాదని ఆయన ఆదేశించారు. విద్యార్థుల ఉత్తీర్ణతపై మాత్రమే దృష్టి ఉండాలని ఆయన అన్నారు. అభ్యసనలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక తర్ఫీదు ఇవ్వాలని ఆయన ఆదేశించారు. ఉపాధ్యాయులు విద్యార్థుల సందేహాలను నివృత్తి చేయడం, వారిని ప్రోత్సహించడం చేయాలని ప్రాజెక్టు అధికారి తెలిపారు. సైన్స్లో బొమ్మలు, సాంఘిక శాస్త్రంలో మ్యాపింగ్ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని ఆయన సూచించారు. మంచి ఫలితాలు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు సాధించి రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలుచుటకు ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. శత శాతం ఫలితాల సాధనే ప్రతీ ఒక్కరికీ ధ్యేయం కావాలని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి కె. శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.

## ఆంధ్రప్రదేశ్, తెలంగాణ బీసీ హక్కుల పోరాట సంయుక్త సమితి సభలో పాల్గొన్న పీతల గోవింద్

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ బీసీ హక్కుల పోరాట సంయుక్త సమితి ఆధ్వర్యంలో ఈరోజు ఢిల్లీ పార్లమెంట్ బీసీ బిల్లు పెట్టాలని చట్టసభలలో బీసీలకు 50% రిజర్వేషన్ కల్పించాలని అలాగే మహిళా బిల్లులలో బీసీ మహిళలకు సబ్ కోటా కల్పించాలి, కేంద్రంలో ఓబీసీలకు మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని బీసీల ఐక్యత వర్ధిల్లాలి అని నినాదస్తూ ప్రాణాలైనా అర్పిస్తాం బీసీ బిల్లును సాధిస్తాం అని చెప్పడం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్.కృష్ణయ్య, జాతీయ బీసీ సంఘం అధ్యక్షులు పాల్గొన్నారు. గౌరవ అతిథిగా రాజ్యసభ సభ్యులు, ప్రముఖ పారిశ్రామిక వేత్త, బీద మస్తాన్‌రావు, విశాఖపట్నం నుంచి విశాఖ జిల్లా బీసీ అధ్యక్షులు మొల్లి అప్పారావు, డైరెక్టర్ ఏపీ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ పీతల గోవింద్, బి.సి. నాయకులు పల్లా దుర్గారావు, గేదెల



నాగరాజు, అప్పారి గిరిబాబు, సురాడ దాసు, మడుపాడు రవి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## యువతలో క్రీడా స్ఫూర్తిని పెంచేందుకే 'ఆడుదాం ఆంధ్ర'



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** యువతలో క్రీడాస్ఫూర్తిని పెంచేందుకే ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఏర్పాటు చేశారని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ తెలియజేశారు. ఈనెల 26 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభం కానున్న ఆడుదాం ఆంధ్ర కార్యక్రమానికి విస్తృత ప్రచార కల్పించే నేపథ్యంలో వైసిపి విశాఖ జిల్లా యువజన పార్టీ అధ్యక్షుడు అల్ల గణేష్ నేతృత్వంలో స్థానిక డి ఎల్ బి పోర్ట్ స్టేడియంలో ఏర్పాటు చేసిన ఫ్రెండ్లీ క్రికెట్‌ను క్రికెటర్ అంబటి రాంబాబుతో కలిసి మంత్రి అమర్నాథ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా క్రీడలను ప్రోత్సహించేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారని దీనికి ఇప్పటివరకు ఏడున్నర లక్షల మంది తమ పేర్లను నమోదు చేసుకున్నారని చెప్పారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో వివిధ క్రీడల పట్ల ఆసక్తి ఉన్నా, అవకాశాలు లేని వారి కోసం ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. మట్టిలో మాణిక్యాలను వెలుగు తీసేందుకు జగన్మోహన్ రెడ్డి తీసుకున్న ఈ నిర్ణయం పట్ల యువకులు ఆయనకు ధన్యవాదాలు తెలియజేస్తున్నారని అన్నారు. మన రాష్ట్రానికి చెందిన క్రీడాకారులకు ప్రపంచ స్థాయిలో గుర్తింపు రావాలన్న ఆశయంతో జగన్మోహన్ రెడ్డి ఈ క్రీడా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని అన్నారు. మన రాష్ట్రానికి చెందిన అంబటి రాయుడు అంతర్జాతీయ క్రికెట్ లో బాగా రాణించి యువతకు స్ఫూర్తిగా నిలిచాడని అన్నారు. వైసిపి యువజన విభాగం అంబటికి ధన్యవాదాలు తెలియజేస్తుందని మంత్రి అమర్నాథ్ చెప్పారు. ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని క్రీడాకారులు సద్వినియోగం చేసుకొని, మరింతగా ఆయా క్రీడల్లో రాణించి రాష్ట్రానికి పేరు తీసుకురావాలని మంత్రి అమర్నాథ్ ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అంబటి రాయుడు మాట్లాడుతూ క్రీడలలో గుర్తింపు రావాలంటే అహర్నిశలు కష్టపడాలని అన్నారు. గ్రామీణ క్రీడాకారులకు జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహం గొప్పదని అన్నారు. నైపుణ్యం గల క్రీడాకారులకు మరింత కోచింగ్ ఇస్తే వారు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తారని అంబటి రాయుడు చెప్పారు. క్రీడలు కులమతాలకు భిన్నంగా ఉంటాయని, మనుషులంతా ఒకటే అని చాటి చెప్పేది క్రీడా వేదిక మాత్రమేనని ఆయన అన్నారు. ప్రతి సంవత్సరం రాష్ట్రంలో క్రీడా ఉత్సవాలు నిర్వహిస్తే బాగుంటుందని అంబటి రాయుడు సూచించారు.

మాజీ మంత్రి అవంతి శ్రీనివాస్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ కూడా క్రీడాకారుడని, దైనందిన జీవితంలో ఆయన బిజీగా ఉన్నా, క్రీడాకారులను ప్రోత్సహించడంలో ఆయన ఎప్పుడు ముందుంటారని అన్నారు. మన వివిధ క్రీడల్లో రాణించిన క్రీడాకారులకు సుమారు 250 కోట్ల రూపాయలు విలువైన ప్రోత్సాహకాలను ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అందించారని తెలియజేశారు. క్రీడలు ఐక్యత, దేశభక్తిని



పెంపొందిస్తాయని అవంతి చెప్పారు. విశాఖ ఉత్తర నియోజకవర్గం వైసీపీ ఇన్చార్జ్ కేకే రాజ్ మాట్లాడుతూ ఆడదాం ఆంధ్ర కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో విజయవంతం చేయాలని కోరారు. వైసిపి జిల్లా అధ్యక్షులు గొల్ల గురువులు మాట్లాడుతూ, రాష్ట్రంలోని యువత అంబటి రాయుడు పూర్తిగా తీసుకోవాలని సూచించారు. ఈ ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ లో మంత్రి అమర్నాథ్ కెప్టెన్సీలో అమర్నాథ్ ఎలెవెన్ జట్టు, కేకే రాజు కెప్టెన్సీలో కేకే రాజు ఎలెవెన్ జట్లు తలపడ్డాయి. ఈ మ్యాచ్లో కేకే రాజు ఎలెవెన్ జట్టు విజయం సాధించింది.

**బైక్ ర్యాలీలో పాల్గొన్న మంత్రి అమర్నాథ్**

ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ కి ముందు వైసీపీ యువజన విభాగం ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ జరిగింది. ఈ బైక్ ర్యాలీని వైసిపి ఉత్తరాంధ్ర ఇన్చార్జి వై వి సుబ్బారెడ్డి ప్రారంభించారు. స్థానిక మద్రిపాలెం ఉడా కాలనీ నుంచి డి ఎల్ బి పోర్ట్ స్టేడియం వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి అమర్నాథ్ ముందుండి బైక్ నడుపుతూ అందర్నీ ఆకట్టుకున్నారు.

## ప్రయోజనాలపై హామీతో 'హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ క్లిక్ 2 అచీవ్'ని ప్రారంభించిన హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్

**ముంబై, (విశాఖ సమాచారమ్):** భారతదేశంలోని ప్రముఖ జీవిత బీమా సంస్థల్లో ఒకటైన హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, కొత్త ప్రొడక్ట్ 'హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ క్లిక్ 2 అచీవ్'ని ప్రారంభించింది. ఇది హామీ ప్రయోజనాలను అందించే పొదుపు జీవిత బీమా పథకం. తమ ప్రియమైన వారి భవిష్యత్తును కాపాడేందుకు, వారి ఆర్థిక లక్ష్యాలను అందుకోవడం కోసం ఈ ప్లాన్ రూపొందించబడింది.

**మీరు మీ పోర్ట్‌ఫోలియోలో హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ క్లిక్ 2ని ఎందుకు జోడించాలి?**

మరుసటి పాలసీ నెల ప్రారంభంలోనే హామీ గల తక్షణ ఆదాయాన్ని పొందగలరు.

ఇది పూర్తిగా అనువైనది - ముందస్తు ఆదాయం, దీర్ఘకాలిక ఆదాయం, ఏకమొత్తం లేదా క్రమానుగతంగా ఏకమొత్తం (మనీ బ్యాక్) వంటి ప్రయోజనాలను పొందేందుకు, మీరు మీ ప్లాన్‌ను అనుకూలంగా చేసుకోవచ్చు

మీరు కోరుకున్న విధంగా హామీ మొత్తాన్ని, అలాగే రైడర్ ప్రయోజనాలతో కావలసిన స్థాయి రక్షణను ఎంచుకోగలరు

**హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ క్లిక్ 2 అచీవ్‌కి గల కొన్ని ప్రత్యేక లక్షణాలు ఏమిటి?**

హామీ ఇవ్వబడే అదనపు సౌకర్యంతో, మీ కలలు అన్నింటినీ నెరవేర్చడం కోసం, మీ సొంత నగదు ఉపసంహరణలను రూపొందించగల సామర్థ్యం.

పెరుగుతున్న ఆదాయం ప్రకారం చేసుకునే ఎంపికతో మీ ఆదాయంపై ద్రవ్యోల్బణం ప్రభావాన్ని తగ్గించవచ్చు.

సేవింగ్స్ బ్యాంక్ ఖాతా 1.5% వడ్డీ రేటుతో మీ మనుగడ ప్రయోజనాలను పెంచుకోగల సౌలభ్యం.

ఆర్ఓపీ (రిటర్న్ ఆన్ ప్రీమియం) మరియు మీరు దానిని స్వీకరించాలనుకుంటున్న సంవత్సరాన్ని ఎంచుకోగలరులి

ఈ కొత్త ప్లాన్ లాంచింగ్ సందర్భంగా హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ ప్రొడక్ట్స్, సెగ్మెంట్స్ హెడ్ అనీష్ ఖన్నా మాట్లాడుతూ, "ప్రతి విషయం ఒక కలతో మొదలవుతుంది, ఎంత పెద్ద కల అయినా దానిని సాకారం చేసుకోవడం కోసం, మీరు సురక్షితమైన అడుగుతో మొదలుపెట్టాలి" అని అన్నారు.

## ఊపిరితిత్తుల క్యాన్సర్: ముందుగా గుర్తించడం మరియు చికిత్స అవకాశాలు

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** భారతదేశంలో ఊపిరితిత్తుల క్యాన్సర్ కేసుల సంఖ్య పెరుగుతోంది, ఇది ప్రజారోగ్యానికి సంబంధించిన ఆందోళన కరమైన ధోరణిని ప్రతిబింబిస్తుంది. పొగాకు నమలటం, ధూమపానం యొక్క అధిక ప్రాబల్యం, ఇండోర్ వాయు కాలుష్య ప్రభావానికి గురికావడం మరియు పర్యావరణ కాలుష్య కారకాలతో సహా అనేక అంశాలు పెరుగుతున్న కేసులకు దోహదం చేస్తున్నాయి. ఈ క్లిష్టమైన సమస్యను పరిష్కరించడానికి, అవగాహన, నివారణ మరియు ముందస్తుగా గుర్తించడం వంటి సమగ్ర విధానం అవసరం.

చికిత్సలో ఇటీవలి పురోగతులు ఈ వినాశకరమైన వ్యాధితో బాధపడుతున్న రోగులకు కొత్త ఆశను అందించాయి. టార్గెటెడ్ చికిత్సల నుండి ఇమ్యునోథెరపీ వరకు, ఊపిరితిత్తుల క్యాన్సర్ చికిత్స యొక్క తీరు వేగంగా మారుతోంది.

ఊపిరితిత్తుల క్యాన్సర్ చికిత్సలో సంచలనాత్మక పరిణామాలలో ఒకటి టార్గెటెడ్ థెరపీలు పెరుగుతుండటం లో కనిపిస్తుంది. ఈ చికిత్సలు క్యాన్సర్ కణాల పెరుగుదల మరియు పురోగతికి సంబంధించిన నిర్దిష్ట అణువులను నాశనం చేయటం లక్ష్యంగా పెట్టుకున్నాయి.

ఇమ్యునోథెరపీ ఊపిరితిత్తుల క్యాన్సర్ చికిత్సలో గేమ్-ఛేంజర్‌గా ఉద్భవించింది. ఈ మందులు క్యాన్సర్ కణాలను గుర్తించడానికి మరియు దాడి చేయడానికి శరీరం యొక్క రోగనిరోధక వ్యవస్థను ప్రేరేపించటం ద్వారా పని చేస్తాయి. ఈ విధానం ముఖ్యంగా ఊపిరితిత్తుల క్యాన్సర్ యొక్క అడ్వాన్స్ స్టేజ్ లతో బాధపడుతున్న రోగులలో గణనీయమైన విజయాన్ని ప్రదర్శించింది. ఇమ్యునోథెరపీ తో జీవిత కాలం పెరగడంతో పాటుగా మెరుగైన ప్రతిస్పందనలకు సంభావ్యతను కూడా అందిస్తుంది, ఈ వ్యాధిని ఎదుర్కోవడంలో ఒక నమూనా మార్పును ఇది సూచిస్తుంది.

# వంటగదిని ఆరోగ్యంగా ఉంచండి



కిచెన్ ప్లాట్‌ఫామ్, స్టౌ, సింక్ ఇలా మనం వంట చేసే క్రమంలో ఎంత తరచుగా వీటిని ఉపయోగిస్తామో అంతే శ్రద్ధగా వీటిని శుభ్రం చేయాల్సి ఉంటుంది.

కిచెన్ ప్లాట్‌ఫామ్, స్టౌ వంటివి రోజూ నీళ్లు, డిటర్జెంట్‌తో శుభ్రం చేయాలి, దీనికోసం సాధారణంగా అంట్లు తోమే సబ్బు-పీచును ఉపయోగించవచ్చు. ఆహారం వండిన ప్రతిసారీ ప్లాట్‌ఫామ్, స్టౌ శుభ్రంగా తడిబట్టతో తుడుచుకోవాలి. ఇక ఆ రోజుకు వంట పూర్తైందను కున్నప్పుడు నీళ్ళు, సబ్బుతో శుభ్రం చేసుకోవాలి. ప్రతి సారీ నీరు పోసి కడగడం వలన స్టౌ త్వరగా తుప్పు పట్టి పాడౌతుంది. మరియు గ్యాస్ బర్నర్స్‌లోకి పొరపాటున నీళ్ళు పడితే మంట సరిగా రాదు. కాబట్టి జాగ్రత్తగా కడగాలి. వంట కోసం వాడిన పాత్రలన్నీ ప్రతిసారీ సబ్బు, నీటితో కడగాలి, తద్వారా వాటికున్న ఆహార పదార్థాల వాసన పోతుంది. మూలమూలల్లోనూ శుభ్రం చేయాలి. లేకపోతే తడి ఉండిపోయి బొద్దింకలు, ఇతర పురుగులు చేరే ప్రమాదం ఉంది.

కాయగూరలు కట్ చేసుకోవడానికి ఉపయోగించే చాపింగ్ బోర్డును, కత్తుల్ని వాడిన ప్రతిసారీ శుభ్రంగా కడిగేయాలి. అలాగే కాయగూరలకు, మాంసాహారానికి వేర్వేరు కటింగ్ బోర్డులు, కత్తులు వాడడం ఉత్తమం. ఎక్కడైతే కాయగూరలు కట్ చేశామో పని పూర్తయిన వెంటనే ఆ ప్రదేశాన్ని శుభ్రం చేయాలి. లేదంటే అక్కడున్న తేమ, కాయగూరల అవశేషాలు వాతావరణంలో ఉన్న బ్యాక్టీరియా, వైరస్, ఇతర క్రిముల్ని త్వరగా ఆకర్షిస్తాయి.

స్టౌ మీద పడిన నూనె మరకలను తొలగించడానికి, కిచెన్ ప్లాట్‌ఫామ్ శుభ్రం చేయడానికి యాంటీ బ్యాక్టీరియల్ వైప్స్‌ని ఉపయోగించచ్చు. తరచూ వాడే రిఫ్రిజిరేటర్, ఒవెన్ వంటి వస్తువులను వారానికోసారైనా క్రిమి సంహారక ద్రావణాలతో శుభ్రం చేయాలి. కిచెన్ అంటే డైనింగ్ టేబుల్ కూడా అదే కోవలోకి వస్తుంది. డైనింగ్ టేబుల్‌ని ఉపయోగించిన ప్రతిసారీ క్రిమి సంహారక ద్రావణాలతో శుభ్రం చేయాలి. లేదంటే ఆహారపు అవశేషాలు దానిపైనే ఉండిపోయి వాతావరణంలోని క్రిముల్ని త్వరగా ఆకర్షించే అవకాశం ఉంటుంది.

ఇక మాంసాహారం కడిగిన తర్వాత సింక్ లేదా ఆ ప్రదేశాన్ని సోప్ వాటర్‌తో ఒకసారి, ఆపై క్రిమి సంహారక ద్రావణంతో మరోసారి శుభ్రం చేసుకుంటే అటు దుర్వాసన రాకుండా ఉంటుంది - ఇటు ఆ ప్రదేశంలో వైరస్, బ్యాక్టీరియాలు వృద్ధి చెందకుండా జాగ్రత్తపడచ్చు. అలాగే పని పూర్తయ్యాక చేతుల్ని సబ్బుతో శుభ్రంగా కడుక్కున్న తర్వాతే ఇతర వస్తువుల్ని తాకాలన్న నియమాన్ని పెట్టుకోండి. దీనివలన మీ చేతికి ఉన్న వాసన ఇతర వస్తువులకు అంటుకోకుండా ఉంటుంది.

వంట కోసం మనం ఉపయోగించిన పాత్రలు, గిన్నెలు వంటివి సింక్‌లో పడేసి ఏ సాయంత్రమో లేదంటే మరునాడు ఉదయమో కడిగేసుకుంటాం. కానీ అలాంటి పాత్రల్లో ఉండే వ్యర్థాలు, జిడ్డుదనం, తేమ కారణంగా వాటి వాడకం పూర్తయిన రెండు గంటల తర్వాత బ్యాక్టీరియా, వైరస్‌లు వృద్ధి చెందడం ప్రారంభమవుతుంది. కాబట్టి రెండు గంటల్లోపే వాటిని కడిగేసుకోవడం ఉత్తమం. ఆరేంత వరకు ఇలా ఎప్పటికప్పుడు పాత్రల్ని శుభ్రం చేసుకోవడం వల్ల శ్రమా తగ్గుతుంది ఆరోగ్యంగానూ ఉండచ్చు. అలాగే ఈ పాత్రల్ని పూర్తిగా ఆరబెట్టడమూ ముఖ్యమే. అలా పూర్తిగా ఆరకుండా తడిగా లేదా నీటితో ఉన్న పాత్రల్ని కబోర్డ్‌లో పెట్టడం వలన కిచెన్‌లో బొద్దింకలు ఉత్పత్తి పెరిగిపోతుది. అందువలన వీలైతే పాత్రలను బట్టతో తుడవడమో లేదా పూర్తిగా ఆరేంత వరకు సర్దకుండా ఉంచడం వలన మన కిచెన్ చాలా ఆరోగ్యకరమైన ప్రదేశంగా ఉంటుంది.

# గిన్నెలకు పట్టిన నూనె జిడ్డును శ్రమలేకుండా వదిలించుకోండి

స్టీలు గిన్నెలు శుభ్రంగా ఉన్నప్పుడు తళతళలాడుతూ ఎంత మంచి లుక్‌ని ఇస్తాయో వాటి మీద గీతలు పడినా లేదా వాటిని సరిగ్గా శుభ్రం చేయకపోయినా పాత వాటిలా కనిపిస్తాయి. ముఖ్యంగా మనం రోజువారీ ఉపయోగించే స్టీలు గిన్నెలను శుభ్రం చేసే విషయంలో మరింత జాగ్రత్తగా వ్యవహరించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో వాటిని శుభ్రం చేయడమే కాకుండా కొత్తవాటిలా మెరిపించేందుకు ఉపకరించే కొన్ని చిట్కాలు

గోరువెచ్చని సోప్‌వాటర్‌తో - రోజువారీ ఉపయోగించే స్టీల్ పాత్రలను శుభ్రం చేసేందుకు కూడా ఓ పద్ధతి ఉంది. దీని ప్రకారం ముందుగా చల్లని నీళ్లతో ఆ పాత్రపై ఎలాంటి పదార్థాలు లేకుండా పైపైన కడిగేయాలి. తర్వాత మెత్తని స్పాంజ్‌తో గోరువెచ్చని నీళ్లలో కలిపిన సోప్ మిశ్రమాన్ని ఉపయోగించి శుభ్రం చేసుకోవాలి. ఒకవేళ స్టీల్‌పాత్రలపై ఏవైనా పదార్థాలు గట్టిగా అంటిపెట్టుకొని ఉంటే వాటిని తొలగించేందుకు స్టీల్ లేదా ఐరన్ స్క్రబ్‌ను ఉపయోగించకూడదు. ఇందుకు నైలాన్ స్క్రబ్‌ని మాత్రమే ఉపయోగించాలి. ఫలితంగా పాత్రలపై ఎలాంటి గీతలు పడకుండా జాగ్రత్తపడచ్చు. అలాగే స్టీల్ గిన్నెలను శుభ్రం చేసిన తర్వాత వాటిని మెత్తని వస్త్రంతో తుడుచుకొని కాసేపు ఆరబెట్టాలి. ఇలా చేయడం వల్ల వాటి మెరుపు ఎక్కువ కాలం నిలిచి ఉండడమే కాకుడా మంచి లుక్‌ని కూడా ఇస్తాయి.

ఏవ్కైనా పదార్థాలు అంటుకున్నప్పుడు- స్టీల్ పాత్రలను ఉపయోగించే క్రమంలో వాటికి అప్పుడప్పుడూ కొన్ని పదార్థాలు జిడ్డులా అంటుకుపోతూ ఉంటాయి. ఇందుకోసం స్టీల్ లేదా ఐరన్ స్క్రబ్‌ని ఉపయోగించకూడదు. అలా అంటుకు



పోయిన పదార్థాలను సులభంగా వదిలించేందుకు బాగా మరిగించిన నీటిని ఉపయోగిస్తే సరి. దీనికోసం మనం చేయాల్సిందల్లా పదార్థం అంటుకున్న పాత్రలో సలసలా మరిగించిన వేడినీళ్లు పోసి అవి చల్లారేవరకు ఆ పాత్రను కదపకుండా ఉంచడమే. ఆ తర్వాత స్పాంజ్ లేదా నైలాన్ స్క్రబ్‌ని ఉపయోగించి పాత్రని శుభ్రం చేస్తే అంటుకున్న పదార్థాలు సులభంగా తొలగిపోతాయి. సాధారణంగా నూనె వాడే పాత్రలు అంటే ఆయిల్ క్యాన్, ఆయిల్ బౌల్ లాంటివి బాగా జిడ్డు పట్టేస్తుంటాయి. ఇలాంటప్పుడు ఆ పాత్రలకు కొద్దిగా సబ్బు పట్టించి, బాగా మరిగించిన నీటిని పోసి చల్లారాక తోమితే సులభంగా జిడ్డు వదులుతుంది, పాత్ర కూడా మెరుస్తుంది.

**టొమాటో కెచప్‌తో** - కొన్ని స్టీల్ పాత్రలకు అడుగుభాగంలో రాగి పూత ఉంటుంది. ఇలాంటి పాత్రలకు స్టీల్ ఒక్కటే కొత్తగా మెరిస్తే సరిపోదు, రాగి కోటింగ్ కూడా కొత్తదానిలా మెరవాలి. ఇందుకోసం వంటింట్లో అందుబాటులో ఉండే టొమాటో కెచప్‌ని ఉపయోగిస్తే సరి. రాగి కోటింగ్ ఉన్న ప్రాంతంలో కెచప్‌ని అప్లై చేసి పది నిమిషాలు అలానే వదిలేయాలి. ఆ తర్వాత స్క్రబ్‌తో వాటిని శుభ్రం చేస్తే కొత్తవాటిలా మెరుస్తాయి.

**మాడిపోయినప్పుడు** - సాధారణంగా స్టీల్ పాత్రలు మాడిపోయినప్పుడు బ్రౌన్ కలర్‌లో మరకలు పడడమే కాకుండా అవి పాత్ర ఉపరితలానికి చాలా గట్టిగా అతుక్కుని ఉండిపోతాయి. ఇలాంటి వాటిని తొలగించాలంటే ముందుగా ఆ పాత్రలో నీళ్లు పోసి కాసేపు నానబెట్టాలి. ఆ తర్వాత అందులో రెండు చెంచాల బేకింగ్ సోడా వేయాలి. ఇలా చేయడం వల్ల పాత్రకు అంటుకున్న పదార్థాల అవశేషాలు సులభంగా తొలగిపోతాయి. తర్వాత నైలాన్ స్క్రబ్‌తో పాత్రలను శుభ్రం చేయడం ద్వారా మాడిపోయిన మరకలన్నీ పూర్తిగా వదిలిపోతాయి.

**వెనిగర్‌తో-** పాత్రల్లో పాలు లేదా నీళ్లు ఎక్కువగా మరిగించినప్పుడు ఖనిజాలు ఎక్కువగా చేరడం వల్ల అడుగుభాగం అట్టకట్టినట్లుగా తయారవుతుంది. ఇలాంటప్పుడు మూడువంతుల నీళ్లలో 1/3 వంతు వెనిగర్ కలిపి ఆ మిశ్రమాన్ని పాత్రలో పోయాలి. తర్వాత కాసేపు కదపకుండా పక్కన పెట్టాలి. కొద్దిసేపటి తర్వాత వేడినీళ్లతో ఆ పాత్రని శభ్రం చేయడం ద్వారా అడుగుభాగంలో చేరిన ఖనిజాలను పూర్తిగా తొలగించవచ్చు.

**స్టీల్ మెరవాలంటే** - స్టీల్ పాత్రలు ఎప్పుడూ మెరుస్తూ ఉండాలంటే అందు కోసం బేకింగ్ సోడా, నీళ్లు కలిపి మెత్తని మిశ్రమంలా చేసుకోవాలి. ఈ పేస్ట్‌ని ఒక క్లాత్ సహాయంతో పాత్రలకు అప్లై చేసి గోరువెచ్చని నీళ్లతో శుభ్రం చేయాలి. ఆ తర్వాత నీటి మరకలు పడకుండా మెత్తని వస్త్రంతో తుడిచి ఆరబెట్టుకోవాలి. ఇలా చేయడం వల్ల స్టీల్ పాత్రలు ఎప్పుడూ కొత్తవాటిలా మెరుస్తూ ఉంటాయి.

# తెలియక కూడా ఈ తప్పులు చేయవద్దు! చేస్తే ఉన్న జుట్టు ఊడిపోతుంది

ఆరోగ్యకరమైన జుట్టు కావాలని ప్రతి ఒక్కరికీ ఉంటుంది. జుట్టు నల్లగా, లావుగా, దృఢంగా ఉండాలని కోరుకుంటారు. అందుకోసం రకరకాల ప్రయత్నాలు చేస్తుంటారు. క్రీములు, షాంపూలు, సీరమ్, మాయిశ్చరైజర్లు ఇలా చాలా రకాల క్రీములు వాడుతుంటారు.

అయినా మంచి జుట్టు సొంతం అవుతుందన్న గ్యారెంటీ లేదు. జుట్టు ఆరోగ్యం అనేది చాలా అంశాలపై ఆధారపడి ఉంటుంది. ఆరోగ్యాన్ని మెరుగుపరచుకునేందుకు ఎన్ని రకాల ప్రయత్నాలు చేస్తారో కొన్ని తెలియకుండా చేసే తప్పుల వల్ల పడ్డ కష్టమంతా వృథా అయిపోతుంది.

**హాట్ టూల్స్:** స్ట్రెయిట్‌నర్‌లు, కర్లింగ్ ఐరన్‌లు, హెయిర్ డ్రైయర్‌లు వంటి హాట్ స్టైలింగ్ టూల్స్ ఉపయోగించడం వల్ల జుట్టు పాడైపోతుంది. జుట్టు ఎండబెట్టడం, చివర్లు చీలిపోవడం, హెయిర్ షాఫ్ట్ బలహీనపడటం వంటి వాటి వల్ల జుట్టు దెబ్బతింటుంది.

**రసాయన చికిత్సలు:** హెయిర్ డైస్, కెరాటిన్ హెయిర్ బోటాక్స్ మొదలైన రసాయన చికిత్సలు జుట్టు నిర్మాణాన్ని విచ్ఛిన్నం చేస్తాయి. అలాగే



జుట్టును బలహీనపరుస్తాయి. వీటి వల్ల జుట్టు ఆరోగ్యం దెబ్బతింటుంది.

**టైట్ హెయిర్ స్టైల్స్:** సెలబ్రిటీలు రకరకాల హెయిర్ స్టైల్స్ క్యారీ చేస్తుంటారు. వాటిని చూస్తున్నప్పుడు అలా విభిన్నంగా ప్రయత్నించాలన్న కోరిక చాలా మందికి కలుగుతుంది. అయితే అలా జుట్టును టైట్ చేసే స్టైల్స్ వల్ల జుట్టు ఆరోగ్యం దెబ్బతింటుంది. గట్టిగా లాగి కట్టే హెయిర్ స్టైల్స్ వల్ల జుట్టు కుదుళ్లు దెబ్బతింటాయి.

**సాధారణ ట్రిమ్‌లు:** ఎప్పటికప్పుడు జుట్టును కట్ చేసుకోవాలి. అలా చేసుకోకపోవడం వల్ల కూడా జుట్టు ఆరోగ్యం దెబ్బతింటుంది. జుట్టు షాఫ్ట్ పైకి వెళ్లి, ఎక్కువ నష్టాన్ని కలిగించేలా చివర్లు చిట్లిపోతాయి.

**తప్పు హెయిర్ ప్రొడక్ట్స్:** జుట్టు రకానికి సరిపడని హెయిర్ ప్రొడక్ట్‌లను ఉపయోగించడం వల్ల జుట్టు పొడిబారుతుంది. చివర్లు చిట్లిపోతాయి. జుట్టు ఆరోగ్యం పాడవుతుంది. ఏ ఉద్దేశంతో ఆయా హెయిర్ ప్రొడక్ట్స్‌ను వాడతామో ఆ లక్ష్యం నెరవేరకపోగా ఆరోగ్యం దెబ్బతింటుంది.

**బ్రషింగ్:** కొందరు జుట్టును అతిగా దువ్వుతుంటారు. చిక్కులు పడ్డ జుట్టును అలాగే బలంగా బ్రషింగ్ చేస్తుంటారు. అలా తరచూ చేయడం వల్ల జుట్టు కుదుళ్లు బలహీనమవుతాయి. అలాగే వెంట్రుకలు చిట్లిపోతాయి.

**పర్యావరణ కారకాలు:** ఎండ, గాలి, విపరీతమైన ఉష్ణోగ్రతలు వంటి కఠినమైన వాతావరణ పరిస్థితులు జుట్టుపై విపరీతమైన ప్రభావాన్ని చూపుతాయి. పర్యావరణ కారకాలు జుట్టు ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయి.

# పప్పు విలువ తెలుసుకోండి



ఎన్ని రుచులున్నా పప్పుతో చేసిన వంటకాల ప్రత్యేకతే వేరు. అయినా సరే! పప్పేనా అంటూ చిన్నచూపు చూస్తుంటాం. కానీ, వీటిల్లోని పోషకాల గురించి తెలిస్తే మాత్రం ఔరా అనక మానం. అవేంటో తెలుసుకుందాం.

ముద్దపప్పు, మామిడికాయపప్పు, సాంబారు ఇలా ఏరకం వంటకానికైనా చక్కటి రుచి తెస్తుంది కందిపప్పు. దీన్ని కాస్త దోరగా వేయించి వండితే సరి. ఈ పప్పులో దొరికే ఫోలిక్ యాసిడ్ మహిళలకు అవసరమైన కీలక విటమిన్. ముఖ్యంగా గర్భిణుల్లో పిండం ఎదుగుదలకు, ఆరోగ్యానికీ ఇది ఎంతో అవసరం. ఈ పప్పుని రోజూ తినడం వల్ల మేలు చేసే ప్రొటీన్లూ, కొవ్వులూ, కార్బో హైడ్రేట్‌లూ శరీరానికి అందుతాయి. తక్షణ శక్తినీ అందిస్తాయి. కొన్ని రకాల గుండె వ్యాధులనూ, క్యాన్సర్లతో పాటు టైప్-2 డయాబెటిస్‌నూ అదుపులో ఉంచే శక్తి దీనికి ఉందంటున్నాయి అధ్యయనాలు.

స్వీట్ చేయాలన్నా, దోశ వేసుకోవాలన్నా, చారు పెట్టుకోవాలన్నా పెసరపప్పుని మించింది లేదు. ఇందులో అధిక మోతాదులో ఫైబర్, తక్కువ మొత్తంలో కెలోరీలు లభిస్తాయి. అలానే, దీనిలో ఐరన్, పొటాషియం, క్యాల్షియం వంటి ఖనిజాలూ తగినన్ని లభిస్తాయి. అందుకే దీన్ని ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల ఎముకలు బలంగా ఉంటాయి. ఇంకా పెసరపప్పు చలువ చేస్తుంది. కాకరకాయ వంటి వేడి చేసే కూరలు వండుకున్నప్పుడు తప్పనిసరిగా పెసరపప్పును వండుకు తినడం వలన వేడిచేయకుండా ఉంటుంది.

తాలింపుల్లో, పచ్చళ్లల్లోనూ ఎక్కువగా వాడే పప్పు శనగపప్పు. శాకాహారులకు చక్కని ప్రొటీన్ ఆధారం. అలానే కాపర్, మాంగనీస్ వంటి ఖనిజాలు ఉండటం వల్ల ఇది మధుమేహాన్నీ అదుపులో ఉంచుతుంది.

# మధుమేహాన్ని పూర్తిగా తగ్గించే అద్భుతమైన ఆహారాలు




మధుమేహంతో బాధపడుతున్నవారు తరచుగా అనారోగ్యకరమైన ఆహారాలు అతిగా తీసుకుంటున్నారు. దీంతో చాలా మందిలో రక్తంలో చక్కెర పరిమాణాలు పెరిగి తీవ్ర దీర్ఘకాలిక సమస్యల బారిన పడుతున్నారు. కాబట్టి ఇలాంటి సమస్యలతో బాధపడేవారు తప్పకుండా పలు రకాల జాగ్రత్తలు పాటించాల్సి ఉంటుంది. అంతేకాకుండా ఆరోగ్యకరమైన ఆహారాలు కూడా ప్రతి రోజు తీసుకోవాల్సి ఉంటుంది. ప్రతి రోజు ఆరోగ్య నిపుణులు సూచించిన ఈ ఫైబర్ కలిగిన ఆహారాలు తీసుకుంటే సులభంగా రక్తంలో చక్కెర పరిమాణాలను నియంత్రించుకోవచ్చు. ఇలాంటి ఆహారాలు ప్రతి రోజు తినడం వల్ల చెడు కొలెస్ట్రాల్ కూడా సులభంగా కరిగిపోతుంది. మధుమేహం ఉన్నవారు రక్తంలో చక్కెర పరిమాణాలను నియంత్రించుకోవడానికి ఏ ఆహారాలు ప్రతి రోజు తీసుకోవాల్సి ఉంటుందో తెలుసుకుందాం.

**ఈ ఆహారాలు మధుమేహం ఉన్నవారు ప్రతి రోజు తీసుకోండి:**

**ఓట్స్:** ఓట్స్‌తో కూడిన ఆహారాలు ప్రతి రోజు తీసుకుంటే శరీరానికి చాలా రకాల ప్రయోజనాలు కలుగుతాయని ఆరోగ్య నిపుణులు తెలుపుతున్నారు. ఇందులో ఉండే గుణాలు చాలా రకాల అనారోగ్య సమస్యల నుంచి ఉపశమనం కలిగిస్తా యి. ఇందులో ఫైబర్ కూడా లభిస్తుంది. కాబట్టి సులభంగా రక్తంలో చక్కెర పరిమాణాలను తగ్గిస్తుంది.

**గుడ్లు:** ఉడికించిన గుడ్లు కూడా శరీరానికి చాలా మంచిది. ఇందులో అధిక పరిమాణంలో ప్రొటీన్స్ ఉంటాయి. కాబట్టి ప్రతి రోజు తినడం వల్ల శరీరంలోని కొలెస్ట్రాల్ నియంత్రణలో ఉంటుంది. మధుమేహంతో బాధ పడుతున్నవారు తప్పకుండా ఆహారంలో గుడ్లను తీసుకోవాల్సి ఉంటుంది.

**అవకాడో:** అవకాడోలో మోనోశాచురేటెడ్ ఫ్యాట్ అధిక పరిమాణంలో లభిస్తుంది. వీటిని ప్రతి రోజు తినడం వల్ల రక్తంలో చక్కెర పరిమాణాలు కూడా నియంత్రణలో ఉంటాయి. అంతేకాకుండా శరీరాన్ని దృఢంగా చేసేందుకు కూడా సహాయ పడుతుందని ఆరోగ్య నిపుణులు తెలుపుతున్నారు.

**బెర్రీలు:** బెర్రీలు ఆరోగ్యాని చాలా మేలు చేస్తాయి. ఇందులో యాంటీ ఆక్సిడెంట్లు అధిక పరిమాణంలో లభిస్తాయి. వీటిని క్రమం తప్పకుండా ఆహారంలో తీసుకోవడం వల్ల శరీరంలో కొలెస్ట్రాల్ పరిమాణాలు తగ్గి రక్తంలో చక్కెర పరిమాణాలు నియంత్రణలో ఉంటాయని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు.

ఆహారంతో పాటు ఏ విషయానికీ టెన్షన్ పడకుండా మనస్సును ప్రశాంతంగా ఉంచుకోవడం వల్ల మధుమేహం అదుపులో ఉంటుందని మానసిక నిపుణుల సలహా.

## మొలకెత్తిన విత్తనాలు తింటున్నారా ?

### అయితే ఈ విషయాలను కూడా తెలుసుకోండి



స్పోర్ట్స్ ఆడేవారు, బరువు తగ్గాలనుకునేవారు మొలకెత్తిన విత్తనాలు లేదా స్ప్రౌట్స్‌ని తినడాన్ని మీరు గమనించే ఉంటారు. వీటిని తినడ వల్ల కలిగే ప్రయోజనాలు ఏమిటో తెలిస్తే మీరు కూడా వదలకుండా అనునిత్యం తీసుకుంటారు. ఇవి గుండెకు, శరీర ఆరోగ్యానికి కూడా ఉపయోగకరమని వైద్యనిపుణులు చెబుతున్నారు.


మొలకెత్తిన గింజలలో పుష్కలంగా ఉండే ప్రొటీన్, మెగ్నీషియం, ఫాస్ఫరస్, మాంగనీస్, ఫోలేట్, విటమిన్ సి, విటమిన్ కె వంటి పలు రకాల పోషకాలు ఆరోగ్యాన్ని సంరక్షిస్తాయి. అలాగే ఇందులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు, అమైనో ఆమ్లాలు కూడా శరీరానికి చాలా అవసరమైనవి.

మొలకెత్తిన గింజలను నిత్యం తీసుకోవడం వల్ల శరీరంలోని కొలెస్ట్రాల్ తొలగిపోతుంది. ఫలితంగా గుండె ఆరోగ్యంగా ఉంటుంది.

అధిక బరువుతో బాధపడేవారికి కూడా మొలకెత్తిన విత్తనాలు ప్రయోజనకరంగా ఉంటాయి. ముందుగా చెప్పుకున్నట్లుగా వీటిని తినడం వల్ల జీర్ణ వ్యవస్థ పని తీరు మెరుగుపడుతుంది. అదీ కాక మీకు తొందరగా ఆకలి వేయదు. అంతేకాక శరీరంలోని కొవ్వును కరిగించే శక్తి వీటికి ఉంది. అందుకు అథ్లెట్స్ తమ డైట్‌లో భాగంగా వీటిని తీసుకుంటారు.

స్ప్రౌట్స్‌లో ఉండే విటమిన్ సీ, యాంటీ ఆక్సిడెంట్లు శరీరంలోని రోగనిరోధక శక్తిని పెంచడంలో సహాయంగా ఉంటాయి. అలాగే రక్తంలో తెల్ల రక్త కణాల వృద్ధికి ఉపయోగకరంగా ఉంటాయి. మొలకలు తినడం వల్ల జుట్టు కూడా బాగా ఒత్తుగా, ఆరోగ్యంగా పెరుగుతుంది.

# కండీషనర్‌ను సరిగా వాడుతున్నారా?




షాంపూను నేరుగా కాకుండా కాసిన్ని నీళ్లలో కలుపుకొని తలస్నానం చేయడం మనకు తెలిసిందే. అయితే కేవలం నీటిలోనే కాకుండా కొన్ని పదార్థాలనూ షాంపూలో కలుపుకొని ఉపయోగించు కోవచ్చు. ఫలితంగా జుట్టు మరింత ఆరోగ్యంగా మారుతుంది.

రోజ్‌వాటర్‌లో షాంపూను కలిపి తలస్నానం చేస్తే కుదుళ్లు దురద పెట్టవు. అంతేకాదు జుట్టు మెత్తగా, పట్టుకుచ్చులా మెరుస్తుంది.

షాంపూలో కాస్త ఎసెన్షియల్ ఆయిల్ కలిపి చూడండి. ఇలా చేయడం వల్ల జుట్టు ఊడడం తగ్గడమే కాకుండా మరింత ఒత్తుగా పెరుగుతుంది.

జుట్టు జీవం కోల్పోయి నిర్జీవంగా కనిపిస్తుంటే షాంపూలో నిమ్మరసం కలిపి చూడండి. వెంట్రుకలు నిగనిగలాడుతూ పట్టుకుచ్చులా మెరుస్తాయి.

జుట్టకు కండీషనర్‌ను సరిగా అప్లై చెయ్యడం వలన చిక్కులు పడకుండా ఆరోగ్యంగా కనిపిస్తుంది. చాలా మంది కండీషనర్‌ను తలకు రాస్తారు. అలా కాకుండా కండీషనర్‌లో కొద్దిగా నీళ్ళు కలిపి కేవలం వెంట్రుకలకు మాత్రమే రాసి, ఫ్యాన్ గాలి కింద ఆరబెడితే పలుచగా ఉన్న జుట్టుకూడా ఒత్తుగా కనిపించడమే కాకుండా చివర్లు చిట్లిపోయే ప్రమాదం తక్కువగా ఉంటుంది. ఇలా ఒక సారి కండీషనర్ పెట్టుకున్న ఎఫెక్ట్ మూడు రోజుల వరకు ఉంటుంది.



## పదికి పది గ్రేడు పాయింట్లు సాధించడమే విద్యార్థుల లక్ష్యం



పాడేరు, (విశాఖ సమాచారమ్): ప్రత్యేక బోధనా తరగతులను సద్వినియోగం చేసుకుని పదికి పది గ్రేడ్ పాయింట్లు సాధించడమే విద్యార్థుల లక్ష్యమని ఐటిడి ఏ పి ఓ వి. అభిషేక్ స్పష్టం చేసారు. గుత్తులపుట్టు గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో పది విద్యార్థులకు నిర్వహిస్తున్న సూపర్ స్విఫ్ట్ శిక్షణా తరగతులను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సాంఘిక శాస్త్రం పాఠ్యాంశాలను బోధించారు. వివిధ పాఠ్యాంశాలలో ప్రశ్నలు వేసి విద్యార్థులు జవాబులు చెప్పడంపై సంతృప్తి వ్యక్తం చేసారు. విద్యార్థులకు హిమోగ్లోబిన్ పరీక్షలు, వైద్య పరీక్షలపై ఆరాతీసారు. విద్యార్థులకు అదనపు స్టడీ మెటీరియల్, దుప్పట్లను పంపిణీ చేసారు. విద్యార్థులకు చక్కని బోధన అందిస్తున్న ఉపాధ్యాయులను అభినందించారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని, ప్రభుత్వం నిర్దేశించిన మెనూను పక్కాగా అమలు చేయాలన్నారు. ఆశ్రమ పాఠశాలలోని ప్రతి విద్యార్థి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. ఉత్తమ బోధన అందిస్తున్న ఉపాధ్యాయులను వి ఓ అభినందించారు. ఈ కార్యక్రమంలో సహాయ గిరిజన సంక్షేమాధికారి ఎల్.రజని, ప్రధానోపాధ్యాయురాలు ఎస్. సింహచలం, పలువురు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించండి





పాడేరు, (విశాఖ సమాచారమ్): గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఐటిడిఏ పి .ఓ వి. అభిషేక్ ఆదేశించారు. ఆశ్రమ పాఠశాలలో విద్యా ప్రమాణాలు మెరుగు పడాలని స్పష్టం చేసారు. ఐటిడిఏ వీడియో కాన్ఫరెన్స్ హాలులో 11 మండలాల ఏటిడబ్ల్యూఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాలల్లో వైద్య సిబ్బంది, వైద్యాధికారులు సికిల్సెల్ ఎనిమియా పరీక్షలు నిర్వహిస్తే ప్రధానోపాధ్యాయులకు సమాచారం అందించి ఏటిడబ్ల్యూఓల అనుమతి తీసుకోవాలని స్పష్టం చేసారు. సంక్షేమాధికారులు గిరిజన విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. జువైనల్ జస్టిస్ ఆదేశాల మేరకు బాలికల ఆశ్రమ పాఠశాలలో అనధికార వ్యక్తులు ప్రవేశించ కూడదని స్పష్టం చేసారు. మండలాల వారీగా మృతి చెందిన ఆశ్రమ పాఠశాలల విద్యార్థుల వివరాలను, మృతికి గల కారణాలు, అందించిన వైద్య సేవలపై ఆరా తీసారు. విద్యార్థులు మృతి చెందితే ప్రభుత్వం నిర్దేశించిన 17 కాలమ్స్ ప్రొఫార్మాలో కచ్చితమైన రిపోర్టులు సమర్పించాలని ఆదేశించారు. సహాయ గిరిజన సంక్షేమాధికారులు ప్రతి రోజు ఒక ఆశ్రమ పాఠశాలను సందర్శించి తనిఖీ చేయాలని సూచించారు. ఆశ్రమ పాఠశాలల నిర్వహణపై నివేదికలు సమర్పించాలని చెప్పారు. ప్రతీ నెలా టూరు డైరీ సమర్పించాలన్నారు. ఆశ్రమ పాఠశాలలో మహిళా ఉపాధ్యాయుల భర్తలు ప్రవేశించ కూడదని, ఆ మేరకు అన్ని ఆశ్రమ పాఠశాలలకు సర్క్యులర్లు జారీ చేయాలని ఉప సంచాలకులను ఆదేశించారు. జి. పి. ఎఫ్ పాఠశాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయులు ఖాళీలపై ఆరా తీసారు. ఖాళీగా ఉన్న పోస్టులలో సి ఆర్ ఎం టిల సేవల వినియోగించాలని సూచించారు. ఆశ్రమ పాఠశాలలకు టెండరులో ఖరారు చేసిన నిత్యావసర సరుకులు సరఫరా చేయాలని, నిల్వ సరుకులు పంపిస్తే సంబంధిత టెండరు దారునిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్ల సేవలను ఏటిడిబ్ల్యూఓ వినియోగించు కోవాలని సూచించారు.

ఈ సమావేశంలో గిరిజన సంక్షేమ ఉపసచాలకులు ఐ. కొండల రావు, 11 మండలాల సహాయ గిరిజన సంక్షేమాధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ సచివాలయ వ్యవస్థతో సేవలు పారదర్శకం



పాడేరు, (విశాఖ సమాచారమ్): గ్రామ సచివాలయ వ్యవస్థ ఏర్పాటుతో ప్రజలకు పారదర్శకమైన సేవలందించేందుకు అవకాశం ఏర్పడిందని పాడేరు శాసనసభ్యులు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి అన్నారు. పాడేరు మండలం సలుగు గ్రామ సచివాలయాన్ని శాసనసభ్యులు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి ప్రారంభించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ గాంధీజీ కలలగన్న గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా జగన్మోహన్ రెడ్డి పాలన కొనసాగిస్తున్నారని చెప్పారు. గాంధీజీ ఆశయాల సాధన దిశగానే ఈ రోజు గ్రామ సచివాలయాలు ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఇదివరకటిలా జిల్లా, నియోజకవర్గ, మండల కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా పంచాయతీ ప్రజలకు ఏ అవసరమైనా, ఏ సమస్య అయినా పరిష్కారానికి గ్రామ సచివాలయాన్ని వేదికగా చేస్తూ ఈ వ్యవస్థను రూపొందించడం జరిగిందన్నారు. ప్రజలకు పాలనను మరింత చేరువ చేసే విధంగా ఈ వ్యవస్థను తీసుకొచ్చిన జగన్ మోహన్ రెడ్డికి గిరిజనుల తరపున ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ గెమ్మెలి అప్పలకొండ, ఎంపీటీసీ చిప్పాడ మీనా, సీనియర్ నాయకులు గంగరాజు, సచివాలయ కన్వీనర్లు రంగసింగి రామనాయుడు, రొబ్బా కృష్ణారావు, వంతల భీమేశ్వరరావు, జిల్లా పార్టీ కార్యదర్శి మంగ్లన్న దొర, మార్కెట్ కమిటీ చైర్మన్ కూతంగి సూరిబాబు, జిల్లా పంచాయతీ రాజ్ కమిటీ అధ్యక్షుడు గబ్బాడి చిట్టిబాబు, సర్పంచులు పాంగి రాంబాబు, కిల్లో పరమేశ్వరి, మాజీ సర్పంచ్ కృష్ణం నాయుడు, సీనియర్ నాయకులు వేమల గోపి, మినుముల కన్నాపాత్రుడు, మండల అధికారులు, సచివాలయ సిబ్బంది, గ్రామ వాలంటీర్లు గృహ సారథులు తదితరులు పాల్గొన్నారు.

## ఉమారామలింగేశ్వర ఆలయం వద్ద అన్నసమారాధన ప్రారంభించిన రత్నాకర్



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): స్థానిక శారదానది ఒడ్డున వెలసియున్న శ్రీ ఉమారామలింగేశ్వరస్వామి వారి ఆలయం వద్ద కార్తీకమాసం ముగింపు పోలిస్వర్గం సందర్భంగా భక్తులకు ఏర్పాటు చేసిన భారీ అన్నసమారాధన కార్యక్రమాన్ని వైసీపీ పార్లమెంట్ పరిశీలకులు దాడి రత్నాకర్ చేతుల మీదుగా ప్రారంభించారు. ముందుగా శ్రీ ఉమా రామలింగేశ్వరస్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు అడ్డబోయిన నారాయణ రావు, కార్యనిర్వాహక అధ్యక్షులు జామి రామయ్య, ఉపాధ్యక్షులు పలకా చంటి, ప్రధాన కార్యదర్శి జెట్టి సూరిబాబు, కోశాధికారి కర్రి జగ్గ అప్పారావు, ఆర్గనైజర్ పలకా కాసులు, పాలకవర్గ సభ్యులతోపాటు బొడ్డపాటి చినరాజా రావు, యల్లపు శ్రీను, ఇంటి త్రినాధ్, కటారి దేముడు, రేబాక ఇంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా నూకాంబిక అమ్మవారి అమావాస్య పూజ



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): అమావాస్య సందర్భంగా శ్రీ నూకాంబిక అమ్మవారి దేవస్థానంలో చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, ఈఓ బండారు ప్రసాద్, ధర్మకర్తల పర్యవేక్షణలో అదిబాబు అమావాస్య యూత్ సభ్యుల ఆధ్వర్యంలో ప్రముఖ కాయగూరల వర్తకులు మళ్ల జగ్గప్పారావు దంపతులు శ్రీ నూకాంబిక అమ్మవారికి అమావాస్య పూజలు, అభిషేకాలు చేసి అమ్మవారికి ఉపారం పెట్టి అనంతరం 1000 మంది భక్తులకు పసందైన అన్నప్రసాదం కార్యక్రమం నిర్వహించారు.

రాత్రి జరిగిన శ్రీ నూకాంబిక అమ్మవారి అమావాస్య పూజలో 18 రకాల ప్రసాదాలను అమ్మవారికి సమర్పించి పూజలు నిర్వహించిన షణ్ముఖ స్వీట్స్ అధినేత కంబంపాటి భానుకి అమ్మవారి ఆశీర్వాదం అందించడం జరిగింది. ఈ కార్యక్రమాలను ధర్మకర్తలు బుద్ధ నర్సింగరాజు, పీలా లక్ష్మి శ్రీనివాసరావు, ఆడారి ఉమా శ్రీనివాసరావు, కొండూరి రవీంద్రనాథ్, గొల్లవిల్లి నర్సింగరావు, పాము అనురాధ సన్నిబాబు, కంటపల్లి శోభారాణి వెంకటరావు, మల్లవరపు ఈశ్వర్రావు, అర్చకులు యనమంద్ర శ్రీనివాసు, అర్చకులు సందీప్ శర్మ, ఆశాది కొణతాల మహాలక్ష్మి నాయుడులు పర్యవేక్షించారు.

## లింగ నిష్పత్తి తక్కువగా ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి-ఆర్డీవో కిషోర్



కాకినాడ, (విశాఖ సమాచారమ్): ఆడ శిశువు పట్ల వివక్షతతో జరిగే భ్రూణ హత్యలను నివారించడంతో పాటు డివిజన్ స్థాయిలో లింగ నిష్పత్తి తక్కువగా ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కాకినాడ రెవెన్యూ డివిజన్ అధికారి ఇట్ల కిషోర్ అధికారులను ఆదేశించారు. కాకినాడ రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో ఆర్డీవో ఇట్ల కిషోర్ వైద్య ఆరోగ్యశాఖ, రెవెన్యూ, లీగల్, స్త్రీ శిశు సంక్షేమం, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కలిసి సబ్ డిస్టిక్ లెవెల్ మల్టీ మెంబర్ అప్రొప్రియేట్ అథారిటీ, డివిజన్ స్థాయి పీసీ, పీఎన్డీటీ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ గర్భస్థ పిండ ఆరోగ్య పర్యవేక్షణకు సంబంధించిన పరీక్షలను లింగ నిర్ధారణకు దుర్వినియోగం కాకుండా అల్ట్రాసౌండ్ స్కానింగ్ సెంటర్లపై నిఘా పెట్టామన్నారు. అల్ట్రాసౌండ్ వైద్య పరీక్షలు లింగ నిర్ధారణకు ఉపయోగించు కోవడం చట్ట రీత్యా నేరమని, డివిజన్ స్థాయిలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించే స్కానింగ్ సెంటర్లపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేశారు. కాకినాడ డివిజన్ స్థాయిలో గుర్తింపు పొందిన 107 స్కానింగ్ సెంటర్లపై డెకాయ్ ఆపరేషన్లు, ఆకస్మిక తనిఖీలు సక్రమంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సంవత్సరం ఏప్రిల్ నెల నుంచి గత నవంబర్ నెల వరకు 46 డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించగా 146 స్కానింగ్ సెంటర్లపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించామన్నారు. పిండ లింగ నిర్ధారణ చట్టంపై ప్రతి గ్రామ స్థాయిలో వైద్య ఆరోగ్యం, స్త్రీ శిశు సంక్షేమ, స్వచ్ఛంద సంస్థలను సమన్వయం చేసుకుంటూ ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహణకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆర్డీవో ఆదేశించారు.

గ్రామస్థాయిలో ఏఎన్ఎం, ఆశ వర్కర్లు సంయుక్తగా గర్భిణీ స్త్రీ గృహాలను సందర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షించాలన్నారు. లింగ నిష్పత్తి తక్కువగా ఉన్న ప్రాంతాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన తెలిపారు. రెండు నెలలకు ఒకసారి నిర్వహించే డివిజన్ స్థాయి పీసీ, పీఎన్డీటీ సమన్వయ కమిటీలోని ఆయా శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని, అన్ని ప్రభుత్వ ప్రైవేటు స్కానింగ్ సెంటర్లోనూ పీసీ, పీఎన్డీటీ చట్టానికి సంబంధించిన బోర్డులను, వాల్ పోస్టర్లను, ధరల పట్టిక, ఫిర్యాదుల కొరకు టోల్ ఫ్రీ నెంబర్ 1800-425-3365ను తప్పని సరిగా ప్రదర్శించేలా చర్యలు తీసుకోవా లన్నారు. 2024 జనవరి 24న జాతీయ బాలికల దినోత్సవం పురస్కరించుకుని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సేవ్ గర్ల్ చైల్డ్ నార్మ్ నినాదంతో విద్యార్థులకు వక్తృత్వ, వ్యాస రచన, పెయింటింగ్, పోస్టర్ ప్రదర్శన వంటి అంశాలపై పోటీలు నిర్వహించి, గెలుపొందిన విద్యార్థులకు నగదు బహుమతులతో పాటు ప్రశంస పత్రాలు అందజేయడం జరుగుతుందని ఆర్డీవో కిషోర్ తెలిపారు.

ఈ సమావేశంలో డీఐవో డా. కె.రత్న కుమార్, గైనకాలజిస్ట్ డా పి. సుజాత, జీజీహెచ్ రేడియాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.పి.ప్రసన్న, పీడీయా ట్రిషన్ డా ఎం.కీర్తి ప్రియా, ఇతర సిబ్బంది కృష్ణారావు, ఎల్.శృతి, పీఠాపురం సీడీపివో తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి అమర్నాథ్‌ను కలిసిన క్రికెటర్ అంబటి రాయుడు



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొనేందుకు విశాఖ వచ్చిన క్రికెటర్ అంబటి రాయుడు రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్‌ను బుధవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. మిందిలోని మంత్రి అమర్నాథ్ క్యాంప్ కార్యాలయంలో అంబటి రాయుడు మంత్రి అమర్నాథ్‌తో కలిసి అల్పాహారం తీసుకున్నారు. అనంతరం ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం, తదితర అంశాలపై చర్చించుకున్నారు. ఈ కార్యక్రమంలో 68వ వార్డు వైసిపి ఇన్చార్జ్ గుడివాడ లతీష్, జడ్పీటిసి శ్రీధర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

### కాలువల పనులను పరిశీలించిన ఎంపీపీ గొర్లి



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): మండలంలోని పిసినీకాడ గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న బిఆర్టి కాలనీలో ప్రధాన కాలువ పనులను బుధవారం మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు గొర్లి సూరిబాబు పరిశీలించారు. అలాగే కాలనీలో ఉన్న గౌరీ పరమేశ్వరులను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా కమిటీ వారు సూరిబాబును సాదరంగా ఆహ్వానించి గౌరీ పరమేశ్వరులకు పూజలు చేయించి ప్రసాదం అందజేశారు.

ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మొల్లేటి హైమా శివాజీ, సత్తిబాబు వైయస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు దేవాలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా విక్టరీ వెంకటేష్ జన్మదిన వేడుకలు



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): ప్రముఖ సినీ నటుడు విక్టరీ వెంకటేష్ పుట్టినరోజు సందర్భంగా అనకాపల్లి పట్టణ విక్టరీ వెంకటేష్ ఫ్యాన్స్ ఆధ్వర్యంలో గవరపాలెం పార్క్ సెంటర్లో పేదలకు దుప్పట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ వెంకటేష్ హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపకుడు పి. చందు మాట్లాడుతూ వెంకటేష్ పుట్టినరోజు సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో 13 జిల్లాల్లో ముఖ్య పట్టణాల్లో హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో పలు సేవా- కార్యక్రమాలు చేపట్టామని అందులో భాగంగా అనకాపల్లిలో ఈ కార్యక్రమాన్ని చేపట్టామని తెలియజేశారు. ఈ సందర్భంగా వెంకటేష్ పుట్టినరోజు కేకు కట్ చేసి అభిమానులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పి. చందు, లాయర్ శ్రీను, రోషన్ కుమార్, పలివెల రాంబాబు, ఎం. సోమేశ్, రాయి వెంకటరమణ, వెంకట అప్పారావు, పచ్చిపాల అర్జున్, కాసా శ్రీను, మడకల జనార్దన్ రావు, లక్ష్మణ్, కిరణ్, శిరగం జెమిని, తదితరులు పాల్గొన్నారు.

## వరాహా లక్ష్మినరసింహ స్వామిని దర్శించుకున్న దాడి రత్నాకర్



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): అనకాపల్లి పట్టణం స్థానిక గవరపాలెం దిబ్బవీధి కొబ్బరితోట వద్ద వెలసిన శ్రీ వరహా లక్ష్మీ నరసింహ స్వామి వారిని వైసీపీ పార్లమెంట్ పరిశీలకులు దాడి రత్నాకర్ బుధవారం ఉదయం దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇక్కడ బుధవారం, గురువారం రెండురోజుల పాటు శ్రీ వరహా నరసింహస్వామి వారి వెండి కవచం అలంకరణ, శ్రీ లక్ష్మి అండాల్ అమ్మవారికి వెండి చీర అలంకరణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా బుధవారం విశ్వక్సేన పూజ, అగ్నిప్రతిష్ఠ, మృత్యుంగ్రహనం, దీక్షాధారణ తదితర పూజా కార్యక్రమాలతో పాటు హెూమం నిర్వహించారు.

యాగశాలలో నిర్వహించిన ఈ హెూమంలో దాడి రత్నాకర్ పాల్గొన్నారు. అనంతరం రత్నాకర్‌ను ఆలయ నిర్వాహకులు మళ్ల రామచంద్ర రావు శాలువాతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో 80వ వార్డు కార్పొరేటర్ కొణతాల నీలిమా భాస్కర్, 80వ వార్డు వైసీపీ ఇన్‌చార్జి కొణతాల భాస్కరరావు, మాజీ కౌన్సిలర్ పెతకంశెట్టి జగన్మోహన రావు, బొడ్డపాటి చినరాజా రావు, కటారి దేముడు, రేబాక ఇంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ కొత్త పోలీస్ కమిషనర్ : ఆన్ డ్యూటీ

హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్‌గా కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి బాధ్యతలను స్వీకరించారు. బంజారా హిల్స్‌లోని పోలీస్ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ టవర్‌లో గల కార్యాలయంలో నిన్న ఉదయం సందీప్ శాండిల్య నుంచి ఛార్జ్ తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు పోలీస్ ఉన్నతాధికారులు శుభాకాంక్షలు తెలియజేశారు.

1994 బ్యాచ్, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ క్యాడర్‌కు చెందిన ఐపీఎస్ అధికారి కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి. రాష్ట్ర విభజన సమయంలో ఆయనను తెలంగాణకు కేటాయించింది డీఓపీటీ. వివిధ పోస్టుల్లో పని చేశారాయన. నిన్నటి వరకు ఆర్గనైజేషన్ అండ్ లీగల్ విభాగం అదనపు డైరెక్టర్ జనరల్‌గా పని చేశారు.

ఆయనను నగర పోలీస్ కమిషనర్‌గా బదిలీ చేసింది రేవంత్ ప్రభుత్వం. ఆ స్థానంలో ఉన్న సందీప్ శాండిల్య యాంటీ నార్కొటిక్స్ బ్యూరో డైరెక్టర్‌గా బదిలీ అయ్యారు. హైదరాబాద్ ట్రాఫిక్ విభాగం అదనపు కమిషనర్ జీ సుధీర్ బాబుకూ స్థానచలనం కలిగింది. ఆయనను రాచకొండ పోలీస్ కమిషనర్‌గా బదిలీ చేశారు. అక్కడున్న దేవేంద్ర సింగ్ చౌహాన్‌కు పోస్టింగ్ ఇవ్వలేదు ప్రభుత్వం.



సైబరాబాద్ జాయింట్ కమిషనర్ (అడ్మిన్) అవినాష్ మహంతి బదిలీ అయ్యారు. సైబరాబాద్ కమిషనర్‌గా అపాయింట్ అయ్యారు. ప్రస్తుతం అక్కడున్న స్టీఫెన్ రవీంద్ర బదిలీ అయ్యారు. ఆయనకు పోస్టింగ్ ఇవ్వలేదు. డీఎస్ చౌహాన్, స్టీఫెన్ రవీంద్రలను డీజీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాల్సిందిగా ఆదేశించారు.

బాధ్యతలను స్వీకరించిన అనంతరం శ్రీనివాసరెడ్డి విలేకరులతో మాట్లాడారు. డ్రగ్స్ రహిత నగరాన్ని తీర్చిదిద్దుతామని అన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం కఠిన నిర్ణయాలను తీసుకుందని పేర్కొన్నారు. రేవ్, వీకెండ్ పార్టీల పేరుతో డ్రగ్స్‌ను వినియోగిస్తే సహించబోమని, డ్రగ్ పెడ్లర్స్‌ను ఉపేక్షించబోమని హెచ్చరించారు.

# వామ్మో! వంటచేస్తుండగా పేలిన ప్రెషర్ కుక్కర్-ఇల్లంతా విధ్వంసం!

ప్రస్తుతం చాలా మంది ఇళ్లల్లో ప్రెషర్ కుక్కర్ల వినియోగం పెరిగింది. వంట త్వరగా పూర్తి చేసేందుకు గానూ ప్రజలు తమ ఇళ్లల్లో ప్రెషర్ కుక్కర్లను ఎక్కువగా వినియోగిస్తున్నారు. ఈ క్రమంలోనే ప్రెషర్ కుక్కర్‌లో వంట చేస్తుండగా అది పేలిపోయినట్లు అనేక వార్తలు విన్నాం. అందుకే కుక్కర్‌లో వంట చేసేటప్పుడు ప్రజలు చాలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు నిపుణులు. కిచెన్‌లో పని చేస్తున్న మహిళల మధ్య అకస్మాత్తుగా కుక్కర్ పేలినట్లు పంజాబ్‌కు చెందిన వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. కుక్కర్ పేలుడు వీడియో చాలా భయానకంగా ఉంది. ఇద్దరు మహిళలు వంటగదిలో పని చేస్తుండగా, గ్యాస్‌పై ఉంచిన కుక్కర్ వీడియోలో కనిపిస్తోంది. ఒక వ్యక్తి టేబుల్ వద్ద కూర్చుని ఉండగా సమీపంలో ఒక పిల్లవాడు ఆడుకుంటున్నాడు. ఒక్కసారిగా కుక్కర్‌లో పేలుడు సంభవించి కుక్కర్ పైకప్పు ఎగిరిపోయింది. వంటగది మొత్తం పొగతో నిండిపోయింది. ఏం జరిగిందో ఎవరికీ అర్థంకాలేదు.

మహిళ కుక్కర్‌లో కూరగాయలు వండుతున్నట్లు సమాచారం. గ్యాస్ ఎక్కువ కావటంతో కుక్కర్ ఒక్కసారిగా పేలిపోయింది. పేలుడు ధాటికి ఇంట్లోని వారంతా తమ ప్రాణాలు కాపాడుకునేందుకు అక్కడి నుంచి పరుగులు తీశారు. అయితే ఈ ఘటనలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. ఈ ఘటనకు సంబంధించిన భయానక వీడియో సోషల్ మీడియాలో హల్‌చల్ చేసింది.

పంజాబ్‌లోని పాటియాలాలో ఈ ఘటన జరిగినట్లు సమాచారం. ఘటన జరిగిన సమయంలో ఇంట్లో ఓ చిన్నారి సహా నలుగురు వ్యక్తులు ఉన్నారు. కుక్కర్ పేలుడు సంభవించడంతో ప్రాణాలు కాపాడుకునేందుకు అందరూ అక్కడి నుంచి పరుగులు తీశారు. పేలుడు ధాటికి వంటగదిలో ఉంచిన వస్తువులు చెల్లాచెదురుగా పడిపోవడం వీడియోలో కనిపిస్తోంది. ఇల్లు మొత్తం ఆవిరితో నిండిపోయి కనిపించింది.

ఇదిలా ఉంటే కుక్కర్ పేలిపోవటానికి కారణాలపై పలువురు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ప్రెషర్ కుక్కర్ పేలుడు అది సరిగ్గా శుభ్రం చేయకపోవడం, అవసరానికి మించి నీటిని నింపడం, బలవంతంగా తెరవడానికి ప్రయత్నించడం, సామర్థ్యం కంటే ఎక్కువ ఉడికించడం, విజిల్, రబ్బరు సరిగ్గా శుభ్రం చేయకపోవడం మొదలైన అనేక కారణాలు ఉండొచ్చునని చెబుతున్నారు. అందుకే ఇళ్లల్లో ప్రెషర్ కుక్కర్ ఉపయోగించి వంట చేసే మహిళలు అప్రమత్తంగా ఉండాలని చెబుతున్నారు.

# హమాస్ దళాల జలసమాధి : గాజా సొరంగాల్లోకి సముద్రపు నీరు




హమాస్ దళాలను గాజా సొరంగాల్లోనే జలసమాధి చేసే వ్యూహాన్ని ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ అమలు చేయడం మొదలుపెట్టింది. దీనిలో భాగంగా గాజా మెట్రోగా పిలిచే హమాస్ సొరంగాల్లోకి సముద్రపు నీటి విడుదలను మొదలుపెట్టింది. ఈ ప్లాన్ తొలి దశలోనే ఉందని అమెరికా వర్గాలు పేర్కొన్నాయి. వీటిల్లో నీరు నింపే ప్రణాళిక పూర్తికావడానికి కొన్ని వారాల సమయం పడుతుందని అంచనా వేస్తున్నారు. ఈ దెబ్బకు హమాస్ దళాలు నక్కిన ఛాంబర్లు, బందీలను దాచిన ప్రదేశాలు, ఆయుధాగారాలు పూర్తిగా ధ్వంసమైపోతాయని భావిస్తున్నారు. కాకపోతే గాజాలోకి వచ్చి చేరే సముద్రపు నీరు కారణంగా ఇక్కడి మంచి నీటి వనరులు దెబ్బతింటాయనే ఆందోళనలు ఉన్నాయి.

**ఇజ్రాయెల్ అంతర్జాతీయ సమాజం మద్దతు కోల్పోవడం మొదలైంది: జోబైడెన్ కీలక వ్యాఖ్యలు**

ఇజ్రాయెల్ దళాలు ఈ సొరంగాలను దెబ్బతీయడానికి భారీగా బంకర్ విధ్వంసక బాంబుల వినియోగం, రసాయన ద్రవాల వినియోగం, శునకాలను, రోబోలను, డ్రోన్లను పంపడం వంటి ఆప్షన్లను పరిశీలించాయి. తాజాగా ఐడీఎఫ్ చీఫ్ హెర్జీ హల్వీ మాట్లాడుతూ సొరంగాలను నీటితో నింపడం మంచి వ్యూహం అని వ్యాఖ్యానించారు. అంతకు మించి వివరాలు వెల్లడించేందుకు నిరాకరించారు. ఇప్పటికే ఐదు భారీ పంపులను గాజా వద్దకు తరలించినట్లు కథనాలొచ్చాయి.

మరోవైపు ఈ వ్యూహంపై అమెరికా అధ్యక్షుడు జోబైడెన్ స్పందిస్తూ "ఆ సొరంగాల్లో బందీలెవరూ లేరనే వాదనలు ఉన్నాయి. కానీ, నేను దానిని ధ్రువీకరించలేను. ప్రతి పౌరుడి మరణం విషాదకరమే. ఇజ్రాయెల్ మాటలకు చేతలకు పొంతన ఉండాలని కోరుకుంటున్నాను" అని పేర్కొన్నారు.

గాజా నుంచి ఈజిప్ట్‌లోకి సొరంగాలు తవ్వడం ఇక్కడి వ్యాపారులకు పరిపాటి. 2015లో గాజాపట్టీ-సినాయ్ ద్వీపకల్పం మధ్య సొరంగాలను ధ్వంసం చేసేందుకు ఈజిప్ట్ సైన్యం మధ్యధరా సముద్రం నీటిని వీటిల్లోకి వదిలింది. గాజా సరిహద్దుల్లోని సుమారు 14 కిలోమీటర్ల మేర భారీ పైపులతో నీటిని పంప్ చేశారు. ఆ తర్వాత ఈ సముద్ర నీటిని చేపల పెంపకానికి వాడారు. ఈ చర్యను అప్పట్లో చాలా పాలస్తీనా గ్రూపులు తీవ్రంగా ఖండించాయి. కానీ, ఆ ప్రాంతంలోని నేల దెబ్బతిందన్న ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఈ చర్య లక్షల మంది పాలస్తీనా వాసుల జీవితాలపై ప్రతికూల ప్రభావం చూపినట్లు 2016లో ఓ నివేదిక పేర్కొంది. తాము ఇజ్రాయెల్ అభ్యర్థన మేరకే ఈ నిర్ణయం తీసుకొన్నట్లు ఈజిప్ట్ అధ్యక్షుడు సిసి అప్పట్లో తెలిపారు.

# మాట తప్పిన జగన్‌కి బుద్ధి చెప్పండి సిఐటియు



**అరకులోయ, (విశాఖ సమాచారమ్):** అంగన్వాడీలకు తెలంగాణ కంటే అదనంగా జీతం పెంచి ఇస్తానని చెప్పి మాట తప్పిన వైసిపి జగన్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి ఉమామహేశ్వర రావు అన్నారు మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా అంగన్వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మెను అరకులో ప్రారంభించారు. అంగన్వాడీలు న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి రాజీలేని పోరాటం చేస్తున్నారని అందుకు అభినందిం చాల్సిందని అన్నారు. జగన్ ప్రభుత్వం అంగన్వాడి ఉద్యమాన్ని తక్కువ అంచనా వేస్తున్నారని గతంలో అంగన్వాడీల ఉద్యమంలోనే తెలుగుదేశం ప్రభుత్వం శంకరగిరి మాన్యుల పట్టిందని అన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటీ చెల్లించాలని, లబ్ధిదారులకి న్యాణ్యమైన ఆహారం అందించాలని ప్రధానమైన డిమాండ్లు తీర్చాలని సమ్మె చేపడుతున్నట్టు తెలిపారు. గర్భిణీలకు, పిల్లలకు నష్టం జరిగితే రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని అన్నారు. కావాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్వాడి వ్యవస్థను నిర్వీర్యం చేయాలని కుట్ర పన్నుతున్నాయన్నారు. దీన్ని అంగన్వాడీలు గమనించాలని అన్నారు. సమస్య పరిష్కరించకుంటే గ్రామాల్లో అంగన్వాడి లబ్ధిదారులు కలుపుగోలుగా ఉద్యమిస్తారని ప్రభుత్వానికి హెచ్చరించారు. తక్షణం రాష్ట్ర ప్రభుత్వం సమ్మె పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు దుర్గా నాగమ్మ, ప్రాజెక్టు కమిటీ నాయకులు, పంగి వెంకటలక్ష్మి, లక్ష్మి, నిర్మల, జానకి, భవాని, సీత, గౌరమ్మ, వంజన తదితరులు పాల్గొన్నారు.

# 175 స్థానాల్లో కొత్త ముఖాలు పెట్టిన జగన్‌కు ఓటమి తప్పదు - బుద్ధ



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** తెలుగుదేశం పార్టీకి వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక మతిభ్రమించిన వైసీపీకి జగన్ రెడ్డికి ఓటమి భయం పట్టుకుందని అందుకే కొత్త నాటకం ఆడుతూ అభ్యర్థులను మార్చుతున్నారని తెలుగు దేశం పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు మాజీ శాసనమండలి సభ్యులు బుద్ధ నాగ జగదీశ్వరరావు బుధవారం టిడిపి పార్లమెంట్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో జగన్ రెడ్డి వ్యవహార తీరుపై మండిపడ్డారు.

తెలంగాణలో రాజకీయ పరిణామాలను చూసి ప్రస్తుత ఎమ్మెల్యేలకే సీట్లు ఇస్తే కొంప మునిగేలా ఉందని భావించి, ప్రకటించిన 11 మంది ఇంచార్జుల్లో ఒక్కరూ కూడా గెలిచే పరిస్థితి లేదని, ఒక నియోజకవర్గం నుంచి మరో నియోజక వర్గానికి నాయకులను మార్చినంత మాత్రాన జగన్ రెడ్డి తలరాత మారదని నాగ జగదీష్ ఎద్దేవా చేశారు.

నాలుగున్నర సంవత్సరాలుగా జగన్ చేసిన పాపం పండిందని, ఆయన అవినీతి, అక్రమాలు పైన, ఇప్పటికే ప్రజలు పీకలు దాకా కోపంతో ఉన్నారని, రానున్న ఎన్నికల్లో వారు పడుతున్న బాధలకు ప్రతీకారంగా జగన్ రెడ్డికి బై బై చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని నాగ జగదీష్ అన్నారు. జగన్ రెడ్డి 175 స్థానాల్లో పోటీ చేసిన అన్నింటిలో డిపాజిట్ గల్లంతు కావడం ఖాయమని, ప్రజలను మరోసారి మోసం చేసేందుకు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జుల మార్పుల పేరుతో కొత్త నాటకం ఆడుతోందని, జగన్ రెడ్డి ఇన్‌చార్జులను మార్చుతున్నా, కానీ ఏపీ ప్రజలు ఏకంగా జగన్ రెడ్డినే మార్చేందుకు సిద్ధంగా ఉన్నారని నాగ జగదీష్ అన్నారు. ఎమ్మెల్యేలు బొమ్మల మార్చినంత మాత్రాన జగన్ బొమ్మ మీదే ప్రజలు కోపంతో ఉన్నారని, జగన్ బొమ్మకు దిమ్మ తిరిగేటట్టు చేయడానికి ప్రజల సిద్ధంగా ఉన్నారని నాగ జగదీష్ వ్యాఖ్యానించారు.ఇప్పటి వరకు వైసీపీ నాయకులు చేసినదంతా ఆంధ్ర ప్రదేశ్ ప్రజలను దోచుకోవడం, వారిని భవిష్యత్తును అంధకారంలోకి నెట్టివేయడం మాత్రమే అన్నారు. మూడు రాజధానుల పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా నాటకాలు ఆడిన వైసీపీ ప్రభుత్వం అభివృద్ధి మాత్రం శూన్య మని, గెలుస్తామని నమ్మకం ఉన్న సీట్లు అన్ని రెడ్డి సామాజిక వర్గానికి కేటాయించి ఓడిపోతామని తెలియజేశారు. తెలిసిన వాటికి బీసీ కార్డును ఉపయోగించి బీసీలకే సామాజిక న్యాయం చేస్తున్నామని బీసీలను మభ్యపెడుతున్నారని, ఎన్ని జిమ్మిక్కులు చేసినా ఓటుకి 5000 రూపాయలు చెల్లించిన ప్రజలు తెలుగుదేశం జనసేన కూటమిని గెలిపించుకోవడానికి ఇప్పటికే నిర్ణయం తీసుకున్నారని ఇక జగన్ రెడ్డిని సాగనంపడమే తరువాయని నాగ జగదీష్ దీమా వ్యక్తపరిచారు. విలేకరుల సమావేశంలో పార్టీ పట్టణ శాఖ అధ్యక్షులు డాక్టర్ కేకేవిఏ నారాయణరావు ప్రధాన కార్యదర్శి కోట్ని రామకృష్ణ పట్టణ శాఖ ఉపాధ్యక్షులు బోడి వెంకటరావు టి ఎస్ టి యు సి నాయకులు సాలాపు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# కార్తీక వన భోజన సమారాధన ప్రారంభించిన ఎస్పీ .మురళీకృష్ణ





**కైలాసగిరి, (విశాఖ సమాచారమ్):** ఆర్మ్డ్ రిజర్వ్ పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ భవాని సమేత కైలాసగిరిశ్వర ఆలయానికి విచ్చేసిన ఎస్పీ మురళీకృష్ణ దంపతులకు పూర్ణకుంభంతో ఆహ్వానం పలికిన ఆర్మ్డ్ రిజర్వ్ డీఎస్పీ పి.నాగేశ్వర రావు ఆలయ కమిటీ సభ్యులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం శ్రీ భవాని సమేత కైలాస గిరిశ్వర స్వామి వారికి జిల్లా ఎస్పీ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక మాసం చివరివారం పురస్కరించుకుని కార్తీక వన భోజన సమారాధన జిల్లా ఎస్పీ, డాక్టర్ శిల్ప దంపతులు ప్రారంభించి భక్తులకు అన్న ప్రసాదాలు వడ్డించారు. ఈ కార్తీక వన భోజన సమారాధనకు చుట్టు ప్రక్కల ప్రాంతాల నుండి సుమారు 10 వేలమంది పాల్గొని, దేవుని దర్శనం చేసుకుని అన్న ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఆర్మ్డ్ రిజర్వ్ డీఎస్పీని వారి సిబ్బందిని ఆలయ కమిటీ సభ్యులను వన భోజన సమారాధన విజయ వంతంగా నిర్వహించినందుకు గాను అభినందించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ జిల్లా అదనపు ఎస్పీ ఏ.అర్ సత్తిరాజులు, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు సతీష్, అరవింద్ కిషోర్ అర్.ఎస్.ఐలు నాయుడు, ఆదినారాయణ, పోలీసు సిబ్బంది మరియు భక్తులు పాల్గొన్నారు.

# గాజువాకలో 'సౌత్ షాపింగ్ మాల్' ప్రారంభం

## సినీ నటి సురభి సందడి

**గాజువాక, (విశాఖ సమాచారమ్):** వస్త్ర ప్రియుల మనస్సు దోచే సరికొత్త షాపింగ్ మాల్ 'సౌత్ షాపింగ్ మాల్'ను కొత్త గాజువాకలో సినీ నటి సురభి బుధవారం ప్రారంభించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేశారు. క్యాష్ కౌంటర్‌ను తిప్పల ప్రణీతా నితేష్ ఓపెన్ చేశారు. హను ఫిలిమ్ ఫ్యాక్టరీ ఈ ఈవెంట్ నిర్వ హించింది. ఈ సందర్భంగా సినీ నటి సురభి మాట్లాడుతూ నాణ్యమైన వస్త్రా లు సరసమైన ధరలకు అందజేస్తూ విని యోగదారుల ఆదరాభిమానాలు చూర గొనాలని పేర్కొన్నారు. ఈ షాపింగ్ మాల్ మరెన్నో బ్రాంచ్ లతో ముందుకు సాగాలని అభిలషించారు. విశాఖపట్నం అంటే ఎంతో ఇష్టమన్నారు. ఈ షాపింగ్ మాల్ ప్రారంభోత్సవానికి విచ్చేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. రాబోయే పండగ సీజన్‌లో వినియోగదారుల మనస్సును దోచే విస్తృత కలెక్షన్లతో ముందుకు రావాలన్నారు.



ఈ సందర్భంగా ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మాట్లాడుతూ సౌత్ షాపింగ్ మాల్‌ను పారిశ్రామిక ప్రాంతం గాజువాకలో ఏర్పాటు చేయడం సంతోషించ తగ్గ విషయమన్నారు. అత్యంత సరసమైన ధరలకు వస్త్రాలను అందించి వినియోగ దారుల అభిమానాన్ని చూరగొనాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు తిప్పల గురుమూర్తి రెడ్డి, పల్లా శ్రీనివాసరావు, కార్పొరేటర్లు మహమ్మద్ ఇమ్రాన్, పల్లా శ్రీనివాసరావు, నరసింహ పాత్రుడు, వురుకూటి చందు, ఏజే స్టాలిన్, స్టేట్ మైనారిటీ సెక్రటరీ ఎస్ఎండీ గౌష్, మాజీ కార్పొరేటర్ మహమ్మద్ రఫీ, క్లాత్ మర్చంట్ అసోసియేషన్ మెంబర్ ఆర్ సుబ్బారావు, బలిరెడ్డి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# హరిప్రియ ట్రస్ట్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం : ముఖ్య అతిథులుగా బండారు, పంచకర్ల

**పరవాడ, (విశాఖ సమాచారమ్):** అనకాపల్లి జిల్లా పరవాడ మండలం భరణికం కాపురస్తులు పెదిశెట్టి రామారావు కుమార్తె చిరంజీవి హరి ప్రియ జన్మదినం సందర్భంగా హరిప్రియ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరంలాగే పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా మాజీ మంత్రి బండారు సత్య నారాయణ మూర్తి, మాజీ ఎమ్మెల్యే విశాఖపట్నం రూరల్ జిల్లా అధ్యక్షులు పెందుర్తి నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ పంచకర్ల రమేష్ బాబు చేతుల మీదగా పేద విద్యార్థులు 10 మందికి 5 వేలు చొప్పున మొత్తం 50 వేలు, 100 మంది పేదవారికి దుప్పట్లు, పదవ తరగతి విద్యార్థి విద్యార్థినులకు ప్లాంక్స్ & పెన్స్, అనారోగ్యంతో బాధపడుతున్న ముగ్గురికి రూ.2500/-ల చొప్పున నగదు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటిసి పైల జగన్నాధ రావు, అట్ట సన్యాసి అప్పారావు, జనసేన పార్టీ సీనియర్ నాయకులు బుగిడి రామ గోవింద్, ఈ బోనంగి సర్పంచ్ శ్రీనివాస్, టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు వియ్యపు చిన్న, మాజీ సర్పంచ్ తాతారావు మరియు వీర మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## వై ఏపీ నీడ్స్ జగన్" కార్యక్రమం 100 % పూర్తి చేయడంపై వార్డు సచివాలయంలలో ప్రత్యేక డ్రైవ్



పార్వతీపురం, (విశాఖ సమాచారమ్): పార్వతీపురం పురపాలక సంఘం పరిధిలో గల వార్డు సచివాలయంలలో వరుస సందర్శనలు చేపట్టిన ఎమ్మెల్యే అలజంగి జోగారావు "వై ఏపీ నీడ్స్ జగన్" కార్యక్రమాన్ని 100% పూర్తి చేయడంపై దృష్టి సారిస్తూ వార్డు సచివాలయంలో కార్యదర్శులు మరియు వాలంటీర్లకు దిశా నిర్దేశనం చేయడం జరిగినది. ప్రతీ ఒక్క కుటుంబాన్ని కూడా కలుసుకుని సర్వే కార్యక్రమం శతశాతం పూర్తి చేయాలని ఆదేశించడం జరిగినది. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, పార్టీ ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, కౌన్సిలర్ సభ్యులు కొరాడ శ్రీనివాసరావు, సువ్వాడ లావణ్య, ఏ ఎం సీ డైరెక్టర్ గోగు గాయత్రి, నాయకులు, కార్యకర్తలు, సచివాలయం ఉద్యోగులు, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

## పార్లమెంట్ సమావేశాల్లో భాగంగా ఎర్త్ సైన్సెస్ మంత్రిని ప్రశ్నించిన ఎంపీ సత్యవతి



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): ఆంధ్రప్రదేశ్‌లో మంత్రిత్వ శాఖ ఉపయోగిస్తున్న ప్రస్తుత వాతావరణ అంచనా వ్యవస్థలు మరియు దేశం యొక్క నిర్దిష్ట అవసరాలకు సరిపోయే స్వదేశీ వాతావరణ అంచనా వ్యవస్థను అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం ఏమైనా చర్యలు తీసుకుందా, స్వదేశీ వాతావరణ అంచనా వ్యవస్థను అభివృద్ధి చేయడానికి ఎంత మొత్తం ఖర్చు చేయబడింది? అలా అయితే దాని వివరాలు, కాకపోతే, దానికి గల కారణాలు ఎంపీ సత్యవతి పార్లమెంట్లో కోరారు. దీనికి మినిస్టర్ ఆఫ్ ఎర్త్ సైన్సెస్ కిరణ్ రిజిజు బదులిస్తూ ఐఐటీఎం, ఈ ఎస్ ఎం అని పిలువబడే ఒక స్టేట్ ఆఫ్ ది ఆర్ట్ ఎర్త్ సిస్టమ్ మోడల్ ని సెంటర్ ఫర్ క్లైమేట్ చేంజ్ రీసెర్చ్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రాపికల్ మెటీరియాలజీలో దేశీయంగా అభివృద్ధి చేశారు అని అన్నారు. ఇది భారతదేశం నుండి వచ్చిన మొదటి ఎర్త్ సిస్టమ్ మోడల్ ఐఐటీఎం ఈఎస్ఎం ఉపయోగించి నిర్వహించబడిన వాతావరణ మార్పు అంచనా, వాతావరణ మార్పుపై ఇంటర్ గవర్నమెంటల్ ప్యానెల్ (ఐపీసీసీ) రూపొందించిన తాజా ఆరవ అసెస్‌మెంట్ నివేదికలో ఉపయోగించబడింది అని అన్నారు మరియు ప్రాంతీయ వాతావరణ మార్పు అంచనాలను డాక్యుమెంట్ చేసే జాతీయ వాతావరణ మార్పు అంచనా నివేదిక విద్యార్థులు, పరిశోధకులు మరియు విధాన రూపకర్తలకు ప్రయోజనం చేకూర్చేందుకు విడుదల చేయబడింది అని తెలిపారు. నివేదిక https://link.springer.com/book/10.1007/978-981-15- 4327-2 వెబ్సైట్‌లో అందుబాటులో ఉంది అని బదులు ఇచ్చారు. 2017-2023 కాలానికి సి సి సిఆర్ ద్వారా సుమారుగా 7.42 కోట్లు ఖర్చు చేయబడింది అని తెలిపారు.

## అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు, ముంచంగిపుట్టు ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయాల ముందు రెండోవ రోజు సమ్మె విజయవంతం



పాడేరు, (విశాఖ సమాచారమ్): ఆంధ్ర ప్రదేశ్ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) అధ్వర్యంలో రెండోవ రోజు సమ్మెకు మండల కార్యదర్శి ఎస్.ఈశ్వరి అధ్యక్షతన జరిగిన సభలో గౌరవ అధ్యక్షురాలు బి.సత్యవతి మాట్లాడుతూ తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం గత నాలుగు సంవత్సరాలుగా వివిధ రకాలుగా ప్రభుత్వానికి విన్నవించినా స్పందించలేదని, అందుకే గత్యంతరం లేక సమ్మె చేయవలసి వచ్చింది అన్నారు. సమ్మెకు సంఘీ భావం తెలిపిన సర్వశిక్షా అభియాన్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.అనిల్ కుమార్ గారు మాట్లాడుతూ వైసీపీ అధినేత సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గారు అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్నం భోజన పథకం, వివిధ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు ఒక్కటి అమలు చేయలేదని అందుకే మన సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. యూనియన్ సీనియర్ నాయకులు పార్వతి, సుజాత, మౌలమ్మా, కాంతమ్మ, మాట్లాడుతూ తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం సానుకూలంగా కృషి చేయాలనీ లేనిచో నిరవధిక సమ్మె సమస్య పరిష్కారం అయ్యే వరకు కొనసాగుతుందని తెలిపారు. వి ఆర్ ఎ సంఘం పరశు రాం, ఆదివాసీ గిరిజన మహిళా సంఘం నాయకులు ఎస్.ఈశ్వరి, రాధమ్మ, మీన్న, ఎస్.చిలకమ్మ, మొంగ్లి, భవాని, సుమిత్ర అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

# పంటలు నష్టపోయిన రైతులకు న్యాయం చేయాలని బిజెపి కిసాన్ మోర్చా ధర్నా



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): వరిచేల వద్దకు వచ్చి నష్టం అంచనాలు వేయాలి. రైతు వద్ద ఉన్న ప్రతి వడ్ల గింజ కొనాలని కోరుతూ అనకాపల్లి జిల్లా కేంద్రంలో ఆర్డీవో కార్యాలయం వద్ద బిజెపి కిషన్ మోర్చా బుధవారం ధర్నా కార్యక్రమం చేపట్టింది. తుఫాన్ హెచ్చరికలను నిర్లక్ష్యం చేసిన రాష్ట్ర ప్రభుత్వ వైఖరికి రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమాలు భాగంగా అనకాపల్లిలో బిజెపి ఆందోళన చేపట్టింది.

ఈ సందర్భంగా బిజెపి జిల్లా అధ్యక్షులు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు మాట్లాడుతూ కౌలు రైతుల ను ఆదుకోవడంతో పాటు రెండు రోజుల్లో రైతుల వద్ద తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వేలకోట్ల రూపాయలు పంటనష్టం జరిగితే అంచనాలు రూపొందిం చడంలో విఫలమైన రాష్ట్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక దిశలో ఉంది. తడిచిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేయాలన్నారు. పత్తి, మిరప, పొగాకు, అరటి, పసుపు పంటలకు ఎకరాకు 50 వేలు నష్టపరిహారం చెల్లించాలని ఎరువులు, విత్తనాలను రైతులకు ఉచితంగా అందించాలనీ ధర్నాలో పాల్గొన్న బిజెపి నేతలు నినాదాలు చేశారు. కిసాన్ మోర్చా ఆందోళనకు పార్టీ నాయకులు, రైతులు పాల్గొన్నారు. కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావ రాజు, జోనల్ ఇన్‌చార్జి జి బీ సాయిరాం, జిల్లా అధ్యక్షులు జె. వి. స్ రాజు, అనకాపల్లి పార్టీ కన్వీనర్ బొడ్డేడ నాగేశ్వర రావు, ప్రధాన కార్యదర్శి పట్టా ప్రసాద్, జిల్లా కార్యదర్శి వుడా రమేశ్, అసెంబ్లీ కో కన్వీనర్ కసిరెడ్డి శ్రీను, ఓ బీ సి మోర్చా రాష్ట్ర కార్యదర్శి కర్రి రామకృష్ణ, స్టేట్ కౌసిల్ గల్లా రాజేశ్వర రావు, తదితరులు పాల్గొన్నారు.

## ఓటరు జాబితా సవరణ ప్రకియ పూర్తి చేయాలి



పార్వతీపురం, (విశాఖ సమాచారమ్): ఓటరు జాబితా సవరణ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేశ్ కుమార్ మీనా తెలిపారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఓటరు జాబితాలో '0' డోరు నెంబరు, ఒకే డోరు నెంబరులో 10 ఓట్లకు మించి ఉన్న వాటి పై తీసుకున్న చర్యలు గూర్చి సంయుక్త కలెక్టర్లతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఓటరు జాబితా లో '0' డోరు నెంబరు, ఒకే డోరునెంబరులో 10 ఓట్లకు మించి ఉన్న వాటి పై తీసుకున్న చర్యలు గూర్చి జిల్లాల వారీగా సమీక్ష నిర్వహించారు. సాంకేతికంగా పరిష్కారం కాని వాటి వివరాలను వెంటనే పంపించాలని తెలిపారు. ఓటరు జాబితాలో చేర్పులు, తొలగింపులు, మార్పులకు సంబంధించి ఫారం 6, ఫారం 7, ఫారం 8 ధరఖాస్తులను 26వ తేదీ లోపల పరిష్కరించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి తెలిపారు. జిల్లాకు సంబంధించిన వివరాలను జాయింటు కలెక్టరు ఆర్. గోవింద రావు తెలియజేసారు. '0' డోరు నెంబరు, ఒకే డోరు నెంబరులో 10ఓట్లు ఉన్నవి జిల్లాలో లేవని, సాంకేతిక కారణాలు వలన పరిష్కరించుటకు వీలుకాని '0' డోరు నెంబరులో ఉన్న 24 ఓట్లు, ఒకే డోరు నెంబరులో 10ఓట్ల మించి ఉన్న ఓట్లు 85 వివరాలను చర్య నిమిత్తం రాష్ట్ర ఎన్నికల కార్యాలయానికి పంపించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి జె.వెంకటరావు, ఇ-సెక్షను సూపరింటెండెంటు రవి పాల్గొన్నారు.

# జమదాల గ్రామ ప్రజల శ్రేయస్సు, సంక్షేమం, అభివృద్ధి జగన్‌తోనే సాధ్యం



పార్వతీపురం, (విశాఖ సమాచారమ్): జమదాల గ్రామ సచివాలయంలో "ఆంధ్రప్రదేశ్ కి జగనే ఎందుకు కావాలంటే" కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు పాల్గొన్నారు. జమదాల గ్రామంలో పార్టీలకు అతీతంగా ప్రతీ ఒక్క కుటుంబాన్ని ఆదుకుని, అందరికీ అండగా నిలిచిన ఏకైక ప్రభుత్వం ఎమ్మెల్యే అలజంగి జోగారావు నాలుగున్నర ఏళ్ల పరిపాలన కాలంలో జమదాల గ్రామ సచివాలయం పరిధిలో ప్రత్యక్షంగా మరియు పరోక్షంగా చేకూరిన లబ్ధి మొత్తం సుమారుగా 22.70 కోట్ల రూపాయలు ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఇందులో ప్రత్యక్ష నగదు బదిలీ (డిబిటీ) ద్వారా 17.12 కోట్ల రూపాయలు మేర నేరుగా ప్రజలకు లబ్ధి చేకూరింది. ఎమ్మెల్యే జోగారావుఅలానే పరోక్ష ప్రయోజనాలు (నాన్ డిబిటీ) ద్వారా 2.95 కోట్ల రూపాయలు గ్రామ ప్రజలకు లబ్ధి చేకూరింది - ఎమ్మెల్యే జోగారావు ఇదే కాకుండా సచివాలయం పరిధిలో నాడు - నేడు స్కూల్, ఆసుపత్రులు, సచివాలయం కార్యాలయాలు, రోడ్లు ఇతర అభివృద్ధి పనులకు గాను సుమారుగా 2.64 కోట్ల రూపాయలు ఖర్చు చేసిన గొప్ప ప్రభుత్వం మనది - ఎమ్మెల్యే అలజంగి జోగారావు పార్వతీపురం రూరల్ జమదాల గ్రామ సచివాలయం పరిధిలో నేడు మండల అధికారులు, ప్రజా ప్రతినిధులు అధ్యక్షతన నిర్వహించిన "ఆంధ్రప్రదేశ్ కి జగనే ఎందుకు కావాలంటే" కార్యక్రమంలో ముఖ్య అతిథులకు స్థానిక శాసనసభ్యులు అలజంగి జోగారావు పాల్గొనడం జరిగినది. ఈ కార్యక్రమంలో భాగంగా సచివాలయం పరిధిలో గల గ్రామ ప్రజలకు అందించిన సహాయాన్ని తెలియచేసే ఆర్థిక వివరాలతో కూడిన పట్టిక రూపంలో తెలియజేస్తూ సచివాలయంలో ఏర్పాటు చేసిన డిస్ప్లే బోర్డును ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రజలందరి సమక్షంలో ఘనంగా ఆవిష్కరించడం జరిగినది. ప్రతి ఒక్కరికి కూడా మన ప్రభుత్వం ప్రత్యక్షంగాను, పరోక్షంగాను లబ్ధి చేకూర్చడం జరిగిందని అందుకోసమే ఈరోజు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం మన సచివాలయం పరిధిలో ప్రభుత్వం చేకూర్చిన లబ్ధిని ప్రతి ఒక్కరికి తెలియ జేసేందుకు ఏర్పాటు చేసిన కార్యక్రమం ఇది అని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమానికి ముందుగా ఎమ్మెల్యే ప్రజా ప్రతినిధులు, నాయకులు కార్యకర్తలు, ప్రజలందరితో కలిసి గ్రామం ఆరంభంలో గల కూడలి వద్ద నుంచి పాదయాత్రగా ర్యాలీగా నడుచుకొని "అపు బాబు నాటకం - జగనన్నే మా నమ్మకం" అని పెద్ద యెత్తున నినాదాలు చేస్తూ ర్యాలీగా సచివాలయం వద్దకు చేరుకోవడం జరిగింది. అనంతరం గ్రామం కూడలిలో ఏర్పాటు చేసిన వైయస్ఆర్ జండాను ఎమ్మెల్యే చేతుల మీదుగా పార్టీ జండాను ఆవిష్కరణ చేసి వందనం అర్పించడం జరిగింది. అనంతరం గ్రామ ప్రజలు సమక్షంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే గారు కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశాన్ని ప్రజలకు తెలియ చేస్తూ వైయస్ జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ నాలుగున్నర ఏళ్ల పరిపాలన కాలంలో మన గ్రామానికి చెందిన అక్క చెల్లెమ్మలకు, రైతన్నలకు, విద్యార్థులకు, డ్వాక్రా మహిళలకు, అగ్రవర్ణాలకు చెందిన మహిళలకు, అన్ని కులాలకు ఇలా అందరికీ ప్రత్యక్షంగాను, పరోక్షంగాను మేలు చేస్తూ సుమారుగా 22.70 కోట్ల రూపాయలు నిధులు వెచ్చించి అందరినీ ఆదుకోవడమే కాకుండా గ్రామ సమగ్ర అభివృద్ధికి కృషి చేసిన ఏకైక ప్రభుత్వం మనది అని ఎమ్మెల్యే తెలిపారు. ఈనాటి కార్యక్రమం ద్వారా ప్రభుత్వం ప్రతీ ఒక్కరికీ చేసిన మేలును వారికి వివరించి వారి వద్ద నుంచి ఆశీస్సులు తీసుకుని వచ్చే ఎన్నికలలో తప్పక మీ అందరి బిడ్డ సీఎం వైయస్ జగన్‌ను మళ్లీ సీఎంగా గెలిపించు కోవాలని, ఈ ప్రభుత్వాన్ని కాపాడు కోవాల్సిన బాధ్యత మీ అందరిపై ఉందని ఎమ్మెల్యే పిలుపు ఇవ్వడం జరిగినది. మన గ్రామంలో పార్టీలకు అతీతంగా ఏటువంటి లంచాలు, మధ్యవర్తులు లేకుండా అర్హులు అందరికీ వారి ఇంటికే వాలంటీర్ల ద్వారా అన్ని సంక్షేమ పథకాలను అందిస్తున్న ఏకైక ప్రభుత్వం మనది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు మండల జెడ్పీటీసీ బలగ రేవతమ్మ, ఎంపీపీ మజ్జి శోభారాణి, పార్టీ అధ్యక్షులు బొమ్మి రమేష్, వైస్ ఎంపీపీ బి రవి కుమార్, స్థానిక మాజీ సర్పంచ్ బంకపల్లి రామకృష్ణ, జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు భీమవరపు కృష్ణమూర్తి, పార్టీ జనరల్ సెక్రెటరీ వి.గురు రాజు, జే సి ఎస్ కన్వీనర్ బి. వాసుదేవరావు, వివిధ గ్రామాల సర్పంచ్లు యాళ్ళ ఈశ్వర ప్రతాప్, జక్కు ప్రవీణ్ కుమార్, వైసీపీ సీనియర్ నాయకులు బలగ నాగేశ్వర రావు, ముప్వల సత్యం నాయుడు, భూపతి శేఖర్, యాళ్ల శ్రీరామ్ నాయుడు, పిఎసిఎస్ చైర్మన్ కె.సత్యనారాయణ, కార్యకర్తలు, సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులు, వాలంటీర్లు, సచివాలయం ఉద్యోగులు, స్థానిక ప్రజలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# ప్రతి పంటకు మద్దతు ధర

## కొయ్యూరులో ధాన్యం కొనుగోలు కేంద్ర ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి



**పాడేరు, (విశాఖ సమాచారమ్):** రైతులు పండించే ప్రతి పంటకు ప్రభుత్వం మద్దతు ధర ఇస్తుందని పాడేరు శాసనసభ్యులు కొట్టగుళ్ళి భాగ్యలక్ష్మి అన్నారు. కొయ్యూరు మండల కేంద్రంలో ధాన్యం కొలుగోల కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా భాగ్యలక్ష్మి మాట్లాడుతూ గతంలో ఈ మండలంలో రెండు కొనుగోలు కేంద్రాలని ఏర్పాటు చేయడం జరిగిందని, ఈసారి మూడో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించడం జరిగిందని చెప్పారు. రైతులకు ఏ ప్రభుత్వమూ ఇదివరకు ఇవ్వనటువంటి భరోసాని వైఎస్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తోందని, అది పంటలకు మద్దతు ధర ఇవ్వడంలో గానీ, రైతు భరోసా పథకం రూపంలో ఆర్థిక సహకారం అందించడంలో గాని, ఈ నాలుగున్నరేళ్లుగా వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు పట్ల చూపుతున్న ఉదారత ఇదివరకు ఏ ప్రభుత్వాలూ చేయలేదన్నారు. దళారీ వ్యవస్థను పూర్తిగా రద్దు చేసి రైతులు అత్యుత్తమ ఉత్పత్తులను సాధించే దిశగా మేలైన విత్తనాలు అందించడం, వ్యవసాయ పనిముట్లు అందించి, రైతుల దగ్గర్నుంచి వారి ఉత్పత్తుల కొనుగోలుకు ప్రత్యేకంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తోందన్నారు. రైతులు అవసరాలను తీర్చే విధంగా అధికారులు పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. దళారులు తక్కువ రేట్లకే రైతుల వద్దకు వెళ్లి పంట పొలాల్లోనే ధాన్యం కొనుగోలు చేసే వాటిని సేకరిస్తున్నటు వంటి తరుణంలో ప్రభుత్వం కూడా ఎక్కువ మంది రైతులు ఏ ప్రాంతంలో ఉన్నారో చూసి ఆ ప్రాంతానికి వాహనాలు తీసుకువెళ్లి వారి ఉత్పత్తులను కొనుగోలు చేసేలా మార్గాలను అన్వేషించాలని సూచించారు. ఈ విషయంపై రైతులకు కూడా అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై కూడా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ నత్తరు శోభన్ బాబు, ఎంపీపీ బడుగు రమేష్, జడ్పీటిసి వారా నూకరాజు, వైస్ ఎంపీపీలు అంబటి నూకలమ్మ, అప్పన్న వెంకటరమణ, మార్కెట్ చైర్మన్ జైతి రాజులమ్మ, మండల పార్టీ అధ్యక్షులు జల్లి బాబులు, బీసీ డైరెక్టర్ గాడి నాగమణి, సర్పంచుల ఫోరం అధ్యక్షులు రేగటి ముసలి నాయుడు, జెసిఎస్ మండల కన్వీనర్ బండి సుధాకర్, పిఎసిఎస్ చైర్మన్ సుమర్ల సూరిబాబు, జిల్లా ఎగ్జిక్యూటివ్ మేంబర్ రీమల గంగాధరం, సర్పంచులు శ్రీను, శేఖర్, వైస్ సర్పంచ్ కాళ్ళ వనం బాబు, ఎంపీటీసీలు మల్లేశ్వరి, బీడిజన అప్పారావు, మహిళా మండల అధ్యక్షురాలు సడ్డా సావిత్రి, రాజేంద్రపాలెం సర్పంచ్, బీటా సింహాచలం, సోషల్ మీడియా కన్వీనర్ గాడి అచ్చిరాజు, జెసి గారు ఎమ్మార్వో, అధికారులు, వైయస్సార్సీపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# కష్టపడి పనిచేసే ప్రతీ కార్యకర్తకు పార్టీలో గుర్తింపు ఉంటుంది : ఎమ్మెల్యే

## బొద్దపు ఎర్రయ్యదొరకి దక్కిన అరుదైన గౌరవం
## వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గా ప్రమాణ స్వీకారం





**యలమంచిలి, (విశాఖ సమాచారమ్):** నియోజకవర్గములో గల నాలుగు మండలాల కార్యకర్తలంటే తనకు ఎంతో అభిమానమని, పార్టీలో సీనియర్లగా ఉన్నవారిని గుర్తించి పదవులు ఇస్తామని యలమంచిలి ఎమ్మెల్యే యువి రమణ మూర్తి రాజు అన్నారు. బుధవారం నాడు నియోజకవర్గ కేంద్రమైన యలమంచిలి పట్టణంలో గల గుజ్జప్ప కళ్యాణ మండపంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలక వర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఎంపిపి బోదెపు గోవింద్ అధ్యక్షత వహించగా ఎమ్మెల్యే యువి రమణమూర్తి రాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఆయన ఆధ్వర్యంలో ఎ.ఎమ్.సి చైర్మన్‌గా బొద్దపు ఎర్రయ్య దొరచే బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కన్నబాబు రాజు మాట్లాడుతూ పార్టీ కోసం శ్రమించిన వారందరికీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఏదో విధంగా న్యాయం చేస్తున్నారని అన్నారు. మార్కెట్ యార్డుని అన్ని విధాలుగా అభివృద్ధి చేయాల్సిన బాధ్యత నూతన పాలకవర్గం మీద ఉందన్నారు. నియోజకవర్గములో ప్రతీ మండలం, గ్రామంలోని ఉన్న నాయకులు, కార్యకర్తలకు తానెప్పుడూ సమన్యాయం చేసే దిశగానే ఆలోచిస్తానన్నారు. రాజకీయాలలో రాణించాలంటే అత్యంత ఉనికిని చాటుకుంటుంన్న పార్టీ కేవలం వైఎస్సార్ సీపీ మాత్రమే, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పార్టీ కోసం కష్టపడి పనిచేసే ప్రతీ ఒక్కరినీ ఏదో విధంగా గుర్తించి కొత్త కొత్త పదవులు సృష్టించి వారికి వారి వారి గ్రామాలలో, వార్డుల్లో పార్టీ నుంచి తగిన గుర్తింపు ఉండేలా పదవులను ఇచ్చారన్నారు. బొద్దపు ఎర్రయ్యదొర తనతో పాటూ ఎప్పటి నుంచో రాజకీయాలలో ఉన్నారని తాను పార్టీ కోసం నిర్విరామంగా కృషి చేస్తున్నారు కనుకే ఆయనకు జెడ్పీటిసి, ఎంపీపీగా, ఎంపీటీసీగా ఇప్పుడు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నామినేటెడ్ పదవులు వచ్చాయన్నారు. తన దగ్గర 800ల పేజీల ఎన్నికల సర్వే పుస్తకం ఉందని ఏ యే పార్టీకి ఎంత మెజార్టీ వస్తుందో ఇప్పటికే తెలిసిందని వైసిపి పార్టీలో ఉన్న నాయకులు ఈ 5 నెలలు కష్టపడి పనిచేసి ప్రజలకు జగన్ మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలు మరింతగా వివరించి, 2024 ఎన్నికల్లో తిరిగి గెలిపించుకోవాలన్నారు.అనంతరం యలమంచిలి లో గల పలువురు ఏ ఎమ్ సి చైర్మన్ బొద్దపు ఎర్రయ్యదొరకి శాలువా కప్పి, పుష్ప గుచ్ఛాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధి కారులు, నాలుగు మండలాల వైసీపీ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# బొగ్గు, ప్లైయాష్ వ్యర్థాల కాలుష్యంపై కలెక్టర్ కు ఫిర్యాదు-చిన్నారావు



**పరవాడ, (విశాఖ సమాచారమ్):** జగనన్నకు చెబుదాం ప్రత్యేక స్పందన కార్యక్రమంలో జిల్లాకలెక్టర్‌కు బొగ్గు, ప్లైయాష్ వ్యర్థాల కాలుష్యంపై ఇచ్చిన ఫిర్యాదుకు స్పందించిన కాలుష్య నియంత్రణ మండలి అధికారులు ప్రత్యేక క్షేత్రస్థాయి పరిశీలనలో గుర్తించిన కాలుష్య తీవ్రత, పరిశ్రమల కాలుష్యం, బొగ్గు లారీల కాలుష్యం, బొగ్గుధూళి కణాలు, ఫ్లయాష్ వ్యర్థాలు, జల కాలుష్యం, భూగర్భ జలాల కాలుష్యంపై మండలం ప్రజలు పడుతున్న ఇబ్బందులను పరిశీలించారు. గత నెల నవంబర్ 15వ తేదీన అనకాపల్లి జిల్లా కలెక్టర్ రవి పటాన్‌శెట్టి ఆధ్వర్యంలో స్థానిక వెన్నెలపాలెం ఏసి కల్యాణ మండపంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం ప్రత్యేక స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేశామని వైయస్సార్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు బోద్దపు చిన్నారావు బుధవారం తెలిపారు. తమ ఫిర్యాదుకు స్పందించిన జిల్లా కలెక్టర్ ఇందుకు సంబంధించిన కాలుష్య నియంత్రణ మండలి అధికారులు క్షేత్రస్థాయి ప్రత్యక్ష పరిశీలన ఈనెల 12న మంగళవారం చేయడం జరిగిందని చిన్నారావు తెలిపారు. కాలుష్య నియంత్రణ మండలి అధికారులు శ్యామ్ వర్ధన్ ఆధ్వర్యంలో కాలుష్య గ్రామాల్లో ఫిర్యాదు దారు చిన్నారావును వెంట పెట్టుకొని క్షేత్రస్థాయిలో మంగళవారం పరిశీలన చేశారు. అధిక సామర్థ్యంతో తిరుగుతున్న భారీ వాహనాలను ప్రత్యక్షంగా చూశారు. వీటి కారణంగా దెబ్బతిన్న ఆర్ అండ్ బి రహదారులను, రోడ్లకు ఇరువైపులా వెదజల్లుతున్న బొగ్గు, ఫ్లయాష్ వ్యర్థాలకు సంబంధించి ప్రత్యక్షంగా చిన్నారావు వివరించినట్లు తెలిపారు. నివాస గృహాలు, రోడ్లకిరువైపులా ఉన్న చెట్లు, పంట పొలాలపై వెదజల్లుతున్న బొగ్గు, ఫ్లయాష్ వ్యర్థాల కాలుష్యం గుర్తించారు. ఇందుకు సంబంధించి కాలుష్యానికి కారణం అవుతున్న నాలుగు ట్రాన్స్పోర్ట్ కంపెనీలను గుర్తించారు. వెంటనే రవాణా శాఖ, పిసిబి విభాగాల నుంచి నోటీసులు జారీ చేసి కాలుష్య సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారని చిన్నారావు తెలిపారు.

# సబ్ జైళ్ళలో హెచ్.ఐ.వి/ఎయిడ్స్ పై అవగాహన సదస్సు



**విజయనగరం:** రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు జిల్లా ఎయిడ్స్ నివారణ మరియు నియంత్రణ సంస్థ కార్యక్రమములో భాగంగా విజయనగరం సబ్ జైల్‌లో ఉన్న వారికి హెచ్ఐవి/ఎయిడ్స్ మరియు సుఖ వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం ఉచితముగా హెచ్ఐవి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమములో భాగంగా పి. బాలాజీ, జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ పాల్గొని హెచ్ఐవి/ఎయిడ్స్ తమ జీవితంలలోనికి రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలియజేశారు. హెచ్ఐవి/ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమములో శ్రీ. పి. దేవి, కొ-ఆర్డినేటర్ విజయనగరం, శ్రీ. రమణమ్మ, ఏ. ఎన్. ఎమ్ పాల్గొన్నారు.

# ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యునిగా అంగనైని ఆనంద్



**పాడేరు, (విశాఖ సమాచారమ్):** ఈనెల 7వ తేదీ నుండి 10వ తేదీ వరకు డిల్లీలో జరిగిన అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) 69వ జాతీయ మహాసభలలో ఏబీవీపీ జాతీయ అధ్యక్ష కార్యదర్శులు జాతీయ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగింది. ఈ నూతన కార్యవర్గంలో ఆంధ్రప్రదేశ్ నుంచి పాడేరు ప్రాంతానికి చెందిన అంగనైని ఆనంద్ జాతీయ కార్యవర్గ సభ్యునిగా ఎన్నిక అయ్యారు. అంగనైని అనంద్ ప్రస్తుతం విజయనగరం సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీలో పీజీ చదువుతున్నారు. ఈ సందర్భంగా అంగనైని అనంద్ మాట్లాడుతూ విద్యారంగ, నిరుద్యోగ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి విద్యారంగ సమస్యలను పరిష్కరించే విధంగా నిరంతరం పోరాటం చేస్తానని తెలిపారు. తన మీద నమ్మకంతో జాతీయ కార్యవర్గంలో చోటు కల్పించిన ఏబీవీపీ జాతీయ అధ్యక్ష కార్యదర్శులకు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖ వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసారు. జాతీయ కార్యవర్గ సభ్యునిగా ఎన్నికైన సందర్భంగా వారికి ఏబీవీపీ నాయకులు, పలువురు అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేసారు.

## పెద్ద చెరువు కాలుష్యంపై
# ఎంపీపీ, జడ్పీటీసి, తహసిల్దార్‌లకు వినతి



**పరవాడ, (విశాఖ సమాచారమ్):** అనకాపల్లి జిల్లా మండల కేంద్రమైన పరవాడ పెద్ద చెరువులో రాంకీ సంస్థ విడుదల చేసిన వ్యర్థ రసాయనాలు కాలుష్యంపై స్థానిక ఎంపీపీ పైల వెంకట పద్మలక్ష్మి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పిఎస్ రాజు, డిప్యూటీ తహశీల్దార్ శాంతి భూషణ్ రావును బుధవారం కలిసి రాంకీ సంస్థపై చట్టపరమైన చర్యలు తీసుకొని, రైతులకు తగు న్యాయం చేయాలని రైతు సంఘం అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాసరావు, రైతులు పైల రామచంద్ర రావు, వశ్రీ హరి, ఎస్ ఎస్ నాయుడు, చుక్క గోపి, బండారు రాజు వినతిపత్రం అందజేశారు.







VISAKHA SAMACHARAM Telugu Daily. Edited, Printed, Published & Owned by : T.Sirisha , Printed at Suryodaya Publications, VisakhaSamacharam Press Door No. 9-3-16, Pitapuram Colony, Visakhapatnam-3. Editorial Office : 9393949345, 9346363839
Hyderabad : Cell : 9030841841, Kakinada : Cell: 9949413661, Pardwada : Cell: 77804 33919, Srikakulam : Cell: 70321 98574, Araku : Cell: 94401 84106,
VSP : 7981904385, 8885687610, Maddilapalem : 9966708776, Yelamanchili : 9441356676